ప్రపత్తి

# శ్రీసన్నిధానం

ఆధ్యాత్మిక మాస పత్రిక

కరీంనగర్ సంపుటి: 01 సంచిక: 06 ఆగస్టు 2024 పేజీలు:36 వెల:30



అత్యధిక పాఠక ఆదరణ పొందుతున్న ఆధ్యాత్మిక మాస పత్రిక



# ముఖచిత్రపరిచయం

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను, రాఖీ ఉత్సవ సమారోహాన్ని, శ్రావణపూర్ణిమ, శ్రీకృష్ణాష్టమి పండుగలను తలపించేలా ముఖచిత్రం దర్శనం ఇస్తోంది. సనాతన సంప్రదాయాలను పుణికిపుచ్చుకున్న రక్షాబంధన్ చరిత్రకథలను గుర్తు చేస్తోంది. అన్నా చెల్లెళ్ళ అనురాగాన్ని, అనుబంధాన్ని తెలుపడంతో పాటు, కొన్నిసందర్భాలలో యుద్ధాలను నివారించి స్నేహ హస్తాన్ని చాటేలా చేసింది. బ్రిటిష్ పాలన సమయంలో బెంగాల్‌ను విభజించకుండా కాపాడింది. ఉద్యమంగా చేపట్టిన రక్షాబంధన్ అంటే ఆశ్చర్యం కలుగుతుంది. ఇంతెందుకు దేవదానవ యుద్ధంలో ఇంద్రుడు తిరిగి విజయం సాధించడానికి కారణం దేవతలంతా ఇచ్చిన రక్షలే సుమా అని పురాణ ప్రవచనం. మహాభారతంలో రామయణంలో రక్షాబంధన్ ప్రస్తావన పరోక్షంగా కనిపిస్తుంది. ఇప్పటికీ మనం అందరూ బాగుండాలని సర్వజగద్రక్ష 'శ్రీరామరక్ష' కడతాంకదా!!

ఆగస్టు 15, 1947 భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చింది. నాటి నుంచి స్వాతంత్ర్య దినోత్సవాన్ని చేసుకుంటూనే ఉన్నాం. ఇది 77 సంవత్సరాల ఉత్సవం. స్వాతంత్ర్యం వచ్చి 76 సంవత్సరాలు పూర్తి చేసుకుని 77వ సంవత్సరంలో అడుగుపెట్టాం. ఇన్నాళ్లలో ఎంతో అభివృద్ధి సాధించాం. సరికొత్త పాఠాలు నేర్చుకుంటున్నాం. కొత్తదనం ఏమిటంటే వికసిత భారత్‌గా అడుగులు వేసుకుంటూ సనాతన ధర్మపరిరక్షణకు కంకణ బద్ధులమై దేశప్రగతిని కాంక్షిస్తూ ముందుకు వెళుతున్నాం.

# గమనిక

ప్రపత్తి శ్రీసన్నిధానం ఆధ్యాత్మిక మాస పత్రికకు సలహాలు, సూచనలు, చందాదారుల చిరునామా మార్పులు, నూతన చందాదారులు కావడానికి ఇ-మెయిల్ ద్వారా తెలియజేయవచ్చును.

help desk:

prapatti.srisannidhanam9@gmail.com

మాస పత్రిక చందా వివరముల గురించి సంప్రదించవలసిన హెల్ప్ డెస్క్ నెంబర్:

9502583323

(ఉదయం 9 గం. నుండి రాత్రి 9 గం. వరకు)




**సంప్రదించండి**

**మా ఈ చిరు ప్రయత్నాన్ని స్వాగతించండి!!**

**-మేనేజింగ్ ఎడిటర్**

### ముఖ్య గమనిక

ప్రపత్తి శ్రీసన్నిధానం ఆధ్యాత్మిక మాస పత్రిక ఈ సంచికలో ప్రచురించిన రచనలలోని భావాలు ఆయా రచయితలవే, రచన సారాంశము రచయిత అభిప్రాయముగా భావించవలెను. ఈ రచనల భావంతో సంపాదకునికి, ట్రస్ట్‌నకు ఎటువంటి బాధ్యత లేదని పాఠకులు గమనించవలసినదిగా మనవి.

**- ఎడిటర్**

ప్రపత్తి **శ్రీసన్నిధానం**

https://srisannidhanam.org

prapatti.srisannidhanam9@gmail.com

**సంపుటి: 1 - సంచిక: 6 ఎడిటర్ : డింగిరి శ్రీనివాసమూర్తి ఆగస్టు 2024 వెల : 30**

## ఇందులో


4. సంపాదకీయం
   శ్రీమాన్ శ్రీ వొద్దిపర్తి రామచంద్రమూర్తి
6. శ్రీరామానుజ సుధామాధురి
   శ్రీమతి సముద్రాల శారద
8. శ్రీపతిస్తుతి
   శ్రీమాన్ శ్రీ అమరవాది వేంకటనర్సింహాచార్యులు
9. శుభాశుభ నిర్ణయాలు-మీమాంస
   శ్రీమాన్ శ్రీ తిరుమల నల్లాన్ చక్రవర్తుల సంపత్కుమార కృష్ణమాచార్య, సిద్ధాంతి
11. భాగవతంలో భగవంతుని కథలు
   శ్రీమతి తిరుమల నీరజ
13. శిష్యాచార్య సంబంధము
   శ్రీమాన్ శ్రీ సముద్రాల శఠకోపాచార్యులు
14. సత్సంప్రదాయ సేవలో శ్రీ రామానుజ యాజ్ఞిక పీఠం
16. గీతామృతం
   శ్రీమాన్ ఆచి వేంకట పాండురంగాచార్య
18. సంపదలు, సౌభాగ్యాన్నిచ్చే శ్రావణమాసం(ప్రత్యేకం)
   శ్రీమాన్ శ్రీ కె.ఇ.స్థలశాయి
20. ఘంటాకర్ణుడు
   శ్రీమతి మహాలక్ష్మీ రాణి గుండు
21. భావ గర్భితం స్తోత్రరత్నం
   శ్రీమాన్ శ్రీ డా.వోలేటి రవికుమారాచార్యులు
22. జ్యోతిర్విజ్ఞానమ్
   శ్రీమాన్ శ్రీ నంబి వేణుగోపాలాచార్య కౌశిక
23. భగవంతునిపైన భారము
   శ్రీమతి వంగల రాధిక
25. శ్రీరామాయణంలో ఉపకథలు
   శ్రీమతి చక్రవర్తుల చూడామణి
27. శ్రీవైష్ణవ సేవాసంఘ రజతోత్సవాలు
29. ఋషి వాక్య ప్రబోధాలు
   శ్రీమాన్ శ్రీ డా.యం.టి.ఆళ్వార్ స్వామి
31. సంస్కృత సాహిత్యంలో ఆణిముత్యాలు
   శ్రీమాన్ శ్రీ డా.కె.కోదండరామాచార్యులు
32. శ్రీప్రతివాది భయంకరం అణ్ణన్ స్వామి
   శ్రీమాన్ శ్రీ దరిపల్లి సురేశ్ ఆచార్యులు

నెలవారిపంచాంగం, మనదేవాలయాలు, పుస్తక పరిచయం, బాలవిజ్ఞానం, శ్రీసన్నిధిపదకేళి


**సంపాదక మండలి**

**వొద్దిపర్తి రామచంద్రమూర్తి** చీఫ్ ఎడిటర్

**సముద్రాల శారద** వొపీనియన్ ఎడిటర్

**డింగిరి శ్రీనివాసమూర్తి** మేనేజింగ్ ఎడిటర్

**గౌరవ సంపాదకులు**

**శ్రీమాన్ శ్రీ నంబి వేణుగోపాలాచార్య కౌశిక**

**శ్రీమాన్ శ్రీ కె. ఇ. స్థలశాయి ఆచార్య**

**శ్రీమాన్ శ్రీ అమరవాది వెంకటనర్సింహాచార్యులు**

నోట్:- సంస్కృతీ సంప్రదాయాల పరిరక్షణకు మీరూ మాతో కలిసినడువండి! అంతర్జాలంలో పబ్లిష్ చేసేవారు ‘శ్రీసన్నిధానం సంచిక నుంచి సేకరణ’ అని రాయడం మరువకండి!! కాపీ రైట్ చట్టానికి కట్టుబడి ఉందాం.

సంపాదకీయం

# ఇంటా బయటా హిందూ సమాజంపై దాడి



**హిం**దూ సమాజంపై ఇంటా బయటా దాడి జరుగుతోంది. మనవాళ్ళే సుమా అనుకుంటే పక్కలో బల్లెంలా కాచుకు కూచుని దాడి చేస్తున్నారు. సభ్యసమాజం చూస్తుందని, ప్రపంచ వ్యాప్తంగా వీక్షిస్తున్నారన్న ఆలోచనలేకుండా మతంపై, దైవంపై, అభిమతంపై చేసిన, చేస్తున్న విమర్శలు మనస్సు చివుక్కుమనేలా అనిపిస్తున్నాయి. విభజించి పాలించు అని గతంలో విదేశీ పాలకులు అమలు పరిచిన సిద్ధాంతం తరహాలోనే ప్రస్తుతం బ్రాహ్మణ సమాజంపై పరోక్ష దాడులు జరుగుతున్నాయి. కట్టు బొట్టు ధరించుకున్న వ్యక్తులు ఇంటర్‌నెట్ ద్వారా మరో వర్గం వారిపై విమర్శల విషం చిమ్ముతున్న వీడియోలు అప్‌లోడ్ అవుతున్నాయి. వారిలో కొందరు నకిలీలే. ఇటు ఫేస్ బుక్‌లలో, అటు యూట్యూబ్ ఛానళ్లలో ఇలాంటివి కనిపిస్తున్నాయి. పోనీలే ఎవరి పాపం వారిది, అని వదిలేస్తే, సదరు యూట్యూబ్ చానళ్లవారు పరస్పరం విమర్శించుకుంటున్న వారిని చర్చా వేదికకు ఆహ్వానించి రచ్చరచ్చ చేస్తున్నారు. నేరుగా రాలేని వారిని ఆన్‌లైన్‌లో చర్చలపేర ఆహ్వానిస్తున్న సందర్భాలు ఉన్నాయి. సభ్యసమాజం ఏమనుకుంటుందో ఏమో అనే ఆలోచన వారికి లేదు. దీని ద్వారా విమర్శలు ప్రతి విమర్శలు తారస్థాయికి చేరాయి, సమాజం సిగ్గుపడేలా తిట్లదండకం వినిపిస్తున్నారు. దీనివల్ల కలతలు కార్పణ్యాలు ఒక వర్గం వారు మరో వర్గానిపై విమర్శనాస్త్రాలు సంధించుకోవడం మామూలైపోయింది. ఒకవైపు దేశసమైక్యత, సమగ్రత సాధించుకుంటూ సనాతన ధర్మం విలువలను తెలియజెప్పేలా, పరిరక్షించేలా పెద్దలు ప్రయత్నిస్తున్న తరుణంలో అడపా దడపా ఇలాంటి సంఘటనలు వినిపిస్తున్నాయి. ఇది ఉభయ తెలుగు రాష్ట్రాలలోనే కాదు ఇతర భాషలలో పలు చోట్ల కనిపిస్తున్నాయి. పత్రికలు జర్నలిజం విలువలను పరిరక్షిస్తూ తమ గీత దాటి ముందుకు వెళ్లకుండా నైతిక విలువల పరిరక్షణలో ఉన్నాయి. కానీ ఆన్‌లైన్ ఛానళ్ళ వాళ్లు తమ పబ్బం గడుపుకోడానికి తమ రేటింగ్ పెంచుకోడానికి కొత్త బాటన నడుస్తున్నారు. ఇది ఇలా ఉంటే అనాదిగా పూజలు అందుకుంటున్న ఆలయాలలో కూడా ఇలా వివాదాలు లేవనెత్తేందుకు కోర్టుగుమ్మం ముందు నిలబెడుతున్నారు. నైతిక విలువలు అంటే భారత దేశం విధానాలు, అలాంటి విధానాలను అడుగడునా గండి కొట్టేప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇవి కాకతాళీయంగా జరిగినవా?, లేక ఎవరైనా పనిగట్టుకుని ఇలాంటి ప్రయత్నాలు చేస్తున్నారా? గమనించాల్సిన అవసరం ఉంది. వివాదాలను లేవనెత్తుతున్న యూట్యూబ్‌ను బ్లాక్ చేసేలా సరైన వివరాలను తెలియజేస్తూ యూట్యూబ్ యాజమాన్యానికి ఫిర్యాదు చేసే అవకాశాలు ఉన్నాయి. ఎక్కువమంది ఫిర్యాదు చేస్తే వాటిలో ఉన్న నిజానిజాలు పరిశీలించి బ్లాక్ చేసే అవకాశాలున్నాయి. నిర్వాహకులపై పరువు నష్టం కలిగించినందుకు కోర్టుద్వారా తగు హెచ్చరికలు జారీ చేయవచ్చు. నష్టపరిహారం కోరవచ్చు. మనమతమేదో మనది పరమతమంటే పడదోయ్ అన్న తరహాలో హిందూ సమాజం నడుచుకోవడం లేదు. మనపక్కఇంటిలో ఉన్న ఇతరులను కూడా ఆదరంగా చూస్తున్న రోజులు ఇవి. వారి పండుగలను విలువలను ఆదరిస్తున్నారు. అంతామనవాళ్ళే సుమా! అనుకుంటూ అంతాకలిసి మెలసి ఉన్న వేళ విషంచిమ్ముతే జరిగేది ఏమిటో తెలియదా?! ఎదుటి మనిషిని విమర్శించాలన్న ఆలోచనఉంటే అది గౌరవంగా భాషలో భావంలో స్పష్టంచేయాలి. కానీ పురాణాలలో ఉన్న పాత్రల విలువలకు లేనిపోని అపవాదు అంటగట్టే రెచ్చగొట్టేధోరణులను ఇప్పటికైనా మార్చుకోవాలి. వాటి అర్థాలు పరమార్థాలు వేరు. ఇప్పుడు నడుస్తున్న పరిస్థితులకు అణుగుణంగా ఇప్పటి సమాజం నడుస్తోంది. విలువలను పరిరక్షిస్తోంది. వేలాది సంవత్సరాలక్రితం పరిస్థితులకు అనుగుణంగా అప్పుడు ఉన్నవారు నడుచుకునేవారు. చరిత్రకు సాక్షాధారాలు శిలా శాసనాలు, కావ్యాలు, ప్రాచీన కట్టడాలు వాటిని పరిరక్షించుకునే బాధ్యత భారతీయులపై ఉంది. దీనిని ఎవరూ కాదనలేరు కానీ అదేపనిగా బురదజల్లే ప్రయత్నాలను క్షమించకూడదు. వారి ఆటలు కట్టించే మార్గాలను చేపట్టాలి. ఇందుకోసం భారతజాతి కదలాలి. మనవిలువలను పరిరక్షించుకోవాల్సిన సమయం వచ్చిందని గుర్తించాలి. ఆలయాలు బాగుంటే సమాజం బాగుంటుందన్న పెద్దల మాటలను పదే పదే గుర్తుంచుకోవాలి! విలువలు పరిరక్షించుకోవాలి!!

–వొద్దిపర్తి రామచంద్రమూర్తి (చీఫ్ ఎడిటర్)

# నెలవారి పంచాంగమ్

శ్రావణమాసం 05-08-24 శుక్లపక్షంతో ప్రారంభమై 02-09-24 వరకు,తదుపరి 03-09-24 నుండి భాద్రపదమాసం

02-08-24 వరకు పుష్యమి కార్తి, 03-08-2024 నుండి ఆశ్లేషా కార్తి, 17-08-24 నుండి మఖ కార్తి, 31-08-24 నుండి పుబ్బ కార్తి. **పండుగలు** :07-08-24 ఆండాళ్ తిరునక్షత్రము. 09-08-24 నాగ పంచమి, 10-08-2024 సుదర్శన పెరుమాళ్ తిరునక్షత్రము, 11-08-24 భాను సప్తమి, 15-08-24 భారత స్వాతంత్ర్య దినోత్సవము, 16-08-24 ఏకాదశి, 18-08-24 వరాహ జయంతి, 19-08-2024 ఉపాకర్మ, రాఖీ పూర్ణిమ, హయగ్రీవ జయంతి, 22-08-24 శ్రీశ్రీశ్రీ త్రిండడి శ్రీమన్నారాయణ రామానుజ పెద్ద జీయర్ స్వామి తిరునక్షత్రము, 26-08-24 స్మార్త శ్రీకృష్ణ జయంతి, 27-08-24 శ్రీకృష్ణ జయంతి, 29-08-24 సర్వేషాం ఏకాదశి.

## మాస ఫలాలు



**మేషం:** ఈ నెల అన్నిరంగాల వారికి లాభించును. ఆర్థికంగా బాగుంటుంది. ఆరోగ్యలాభం. వాహన సౌఖ్యం, సంతానసౌఖ్యం.



**వృషభం:** ఈనెల చేయు వృత్తి వ్యాపారాలందు అనుకూలత. సమస్యలు పరిష్కారం. ఆరోగ్యం బాగుంటుంది. సంతోషకరవార్తలు, పనులు పూర్తిఅగుట



**మిథునం:** ఈ నెల చేయువృత్తి వ్యాపారాలందు అనుకూలత, ఆర్థిక సమస్యల నుండి బయటపడుదురు. సంతోషకరవార్తలు వింటారు. అన్నింటావిజయం..



**కర్కాటకం:** ఈ నెల వృత్తి వ్యాపారాలందు అనుకూలత. ఆదాయం వృద్ధి, ఉద్యోగులకు ప్రమోషన్తోకూడిన బదిలీలు, సంతోషవార్తలు, ఉత్సాహంగా ఉంటారు.



**సింహం:** ఈ నెల పరిస్థితులు అనుకూలించవు. అంతా వ్యతిరేకంగాను ఉంటుంది. మనశ్శాంతి ఉండదు. ఏ పని చేయబుద్ధికాదు. ఆరోగ్యభంగాలు, ఆర్థిక సమస్యలు వెంటాడును.



**కన్య:** ఈ నెల అనుకూలంగా ఉండదు.ఆదాయంనకు మించిన ఖర్చులు, పనులు కలసిరాక ఇబ్బందులు. కుటుంబ సమస్యలు, గృహమార్పులు తప్పవు. నమ్మినవారి వలన మోసపోవుట.



**తుల:** ఈ నెల మీమాటకు ఎదురుండదు. అన్నిరంగాలు వారికి చేయు వృత్తి వ్యాపారాలందు రాణింపు ఉంటుంది. ఆరోగ్య లాభములు, నూతన కార్యాలకు శ్రీకారం.



**వృశ్చికం:** ఈనెలలో అన్ని విధాలుగా బాగుండును. చేయు వృత్తివ్యాపారాలలో రాణింపు, ఆదాయంనకు లోటుండదు. సమస్యలు పరిష్కారమగును.



**ధనుస్సు:** ఈనెలలో అన్నింటా జయం, ఆరోగ్యం బాగుండును. ఆర్థికలావాదేవీలు సంతృప్తి, ధైర్యంగా వ్యవహరిస్తారు. గతంలో ఏర్పడిన సమస్యలు తొలగును.



**మకరం:** ఈ నెల అనేక ఇబ్బందులు. స్థానచలనాలు. సంతానం ద్వారా సమస్యలు. ఊహించనిపరిణామాలు, ఎన్నికష్టాలున్నా ధైర్యంతో ఎదుర్కొనగలరు



**కుంభం:** ఈ నెల అనుకూలించదు. ఏపనీపూర్తికాదు. అన్నింటా అపజయమే. ఆరోగ్యభంగాలు, అనవసర ధనవ్యయం, ఏమి మాట్లాడినా విరోధమే



**మీనం:** ఈ నెల శుభాశుభ మిశ్రమ ఫలితాలు, కొన్నింటిలోజయం, కొన్నింటిలో అపజయం. కార్యాలు ప్రారంభంలో నిలచిపోయినా చివరలోపూర్తి. ఆదాయం నకు మించినఖర్చులు.

### రాఖీ పూర్ణిమ

రాఖీ పౌర్ణమి రోజు మహిళలు వారి సోదరులకు. ముందుగా గంధం, కుంకుమ కూడా పెట్టి. కుంకుమ బొట్టు పెట్టిన తర్వాత తలపై అక్షింతలు వేయడం ఆనవాయితి.

యేన బద్ధో బలీ రాజా దానవేంద్రో మహాబలః।
తేన త్వామభి బద్నామి రక్ష మాచల మాచల॥

రాఖీ కట్టిన తర్వాత తమ సోదరుడిని ఆశీర్వదీస్తూ అక్షింతలు వేయాలి. తర్వాత సోదరి హారతి ఇస్తుంది. అనంతరం ఒకరికొకరు స్వీట్లు తినిపించుకుంటారు.

### మంచి రోజులివిగో...

**ఈనెల వివాహ, గృహారంభ, గృహప్రవేశ శుభ ముహూర్తములు 8,9,10,11,15,16,18,21,22,23,28 ముహూర్తములు కలవు.**

# గతి గమ్యం గురువే సర్వం!



– శ్రీమతి సముద్రాల శారద

పరిణితి గల కళాకారుడు తన కళను ప్రదర్శించడంలోనే ఆనందం పొందుతాడు. ఒక సంగీత విద్వాంసుడు తాను గాత్ర వాయిద్యాలతో శ్రోతల నెంత పరవశులను చేస్తాడో అంతకంటే వందరెట్లు ఆనందాన్ని తాను పొందుతాడు. ఫలితంగా ప్రశంసలు సన్మానాలు తదుపరి వచ్చే ఫలితాలు మాత్రమే!. పరిపక్వత సాత్వికత గల కార్యసాధకులు ఫలితాన్ని ఆశించరు. భారతీయ సంస్కృతిలో భగవద్వాక్యంగా పెద్దలు ఉపదేశించే జీవిత సూత్రం ప్రతిఫలాపేక్ష లేకుండా కర్తవ్యాన్ని ఆచరించాలి అని. ప్రధానంగా ఆధ్యాత్మిక విషయాల్లో ఫలాపేక్ష లేకుండా కార్యసాధనకు ఉపక్రమించాలనే అంశం మరింత ప్రాధాన్యత వహిస్తుంది. “కర్మణ్యేవాధికార స్తే మా ఫలేషు కథాచన” అనగా ఎప్పుడయినా కర్మాచరణమునందే అధికారము కానీ ఫలముల యందు కాదు అని గీతా శాస్త్రం బోధిస్తుంది. ఫలాపేక్ష లేని ధర్మాచరణము చిత్తశుద్ధిని కలిగిస్తుంది. అటువంటి నిష్కామ కర్మనే యోగం అంటారు. “స్వల్ప మప్యస్య ధర్మస్య త్రాయతే మహతో భయాత్” అని ధర్మాచరణ పూర్వకమైన కర్మ అది ఎంతటి భయాలనుంచైనా కాపాడుతుంది.

ఆ విధంగా పరిపక్వమైన జ్ఞానవంతులను ఉపాయ నిష్ఠులు ప్రపన్నులు అంటారు. భగవంతుడిని ఉపేయముగా (పొందదగిన లక్ష్యముగా) భక్తి శరణాగతి అనే సాధనను ఉపాయముగా (మార్గముగా) పెద్దలు చెప్తారు. ప్రపన్నులైన వారు ఉపాయమును ఉపేయమును కూడా ఒకటిగానే భావిస్తారట! అనగా ఫలాపేక్ష లేకుండా చేయు కర్మలను భగవదర్పితంగా భావిస్తారు. అనగా వారి దృష్టిలో ఉపాయ ఉపేయములు వేరు వేరు కాదు.

చరమోపాయ నిర్ణయం అనేది సంప్రదాయంలో మరొక విశేషం. భగవంతుని పొందుటకు ఉపాయము ఆచార్యుడు మాత్రమే! ఆచార్యులను సమాశ్రయించడం అంతిమోపాయ నిష్ఠగా భావిస్తారు.

ఈ విధంగా అందరూ ఆశ్రయించదగిన జగదాచార్యులను ఆశ్రయించిన శిష్యులు ఎందరో ఉన్నారు. వారిలో ఒక గొప్ప విలక్షణమైన విశ్వాస గరిమ గల ప్రపన్నాగ్రేసరులు ఆంధ్ర పూర్ణులు అని ప్రసిద్ధులైన వడుగనంబి అనువారు. ప్రత్యక్ష దైవమై తనను ఉద్ధరించే భగవద్‌రామానుజాచార్యులనే ఉపాయముగా ఉపేయముగా భావించారు. వారి జీవన గతి గమ్యం సర్వం గురువే! అంతటి దీక్షతో సదా ఆచార్యులకు సపర్యలను చేసేవారు. వారికి క్షీర కైంకర్యం వంటి సేవలను ఆచరించడం, గురు పాదుకలను పూజించడం యతిరాజుల సుందర స్వరూపాన్ని ఆరాధించడం ఇదే వారి జీవన సాధన. ఆచార్యులు కూడా ఎంతో ప్రేమగా “వడుగా” అని పేరు పెట్టి పిలిచేవారట!

భగవద్ రామానుజాచార్యులు శ్రీరంగం నుండి మేల్నాడుకు ప్రయాణమైనప్పుడు మధ్యలో మైసూరు సమీపంలో కర్ణాటక ప్రాంతంలో మిథిలా అను గ్రామంలో బస చేశారు. అక్కడ ప్రజల అజ్ఞానాన్ని చూసి ఆచార్యభక్తి నిష్ఠలు ఎక్కువగా గల శిష్యుడు దాశరథి పాదస్పర్శతో అక్కడి జలాన్ని పవిత్రం గావించారు. గ్రామ ప్రజలంతా భక్తితో జగదాచార్యులను ఆదరించారు. ఆగ్రామానికి సాలగ్రామం అని పేరు పెట్టారు. ఆ సమయంలోనే వడుగనంబి యతిరాజులను ఆశ్రయించారు.

భగవద్ రామానుజ చరిత్రను తెలిపే ప్రాచీన గ్రంథాలన్నింటిలో వడుగనంబి గురు భక్తి వైభవం అద్భుతంగా వివరించబడింది.

మంత్రానుష్ఠానం చేసేటప్పుడు ముందుగా గురుపరంపర పఠించాలనేది నిర్దిష్ట నియమం. ఒకసారి ఒక వైష్ణవ స్వామి తిరుమంత్రాన్ని మాత్రమే చెప్పగా విని ఆంధ్ర పూర్ణులు “ఇది

# శ్రీరామానుజ సుధామాధురి



నవకార్యం” (చేయకూడని కార్యం) అని చెప్పి అక్కడి నుండి వెళ్లిపోయారట! ఈ విషయాన్ని ధృవీకరిస్తూ, గుర్తుచేస్తూ శ్రీపిళ్లైలోకాచార్యులు శ్రీవచన భూషణం అనుగ్రంథంలో “జప్తవ్యం గురు పరంపరైయుం ద్వయముం” అని మంత్రానుష్ఠానంలో గురుపరంపర ద్వయ మంత్రము తప్పక పఠించాలని నిర్దేశించారు. అలాగే మనవాళ మామునుల వ్యాఖ్యాన గ్రంథాల్లో కూడా ఈ అంశం గుర్తు చేయబడిందని పెద్దలు ప్రవచిస్తారు.

ఆంధ్ర పూర్ణులు పరమపదించినప్పుడు “పరమపదించారు” అని పలికితే అది వారి విషయంలో దోషంగా భావించి ఆచార్య తిరువడిగళ్ చేరారు అని సంభావించారట! భగవత్ రామానుజాచార్యులు చరమస్థితిలో వీరి ఒడిలో పాదాలు ఉంచుకొని పరమపదం వేంచేసారని చరిత్ర. అంతటి గురుభక్తి పరాయణులు వడుగ నంబి.

వేలమంది శిష్యులలో బుద్ధిశాలి విలక్షణులు వడుగనంబి వారు. వీరు గురుభక్తి పరాయణతలో లోకానికి ఆదర్శంగా నిలిచిన ఐతిహ్యాలు ఎన్నో ఉన్నాయి.

వీరు రచించిన శ్రీరామానుజ అష్టోత్తర శతం ప్రాచీన గ్రంథం ప్రపన్నామృతంలో 54 వ అధ్యాయంలో ఇది మనకు లభిస్తుంది. రెండవ గ్రంథం యతిరాజ వైభవం. అష్టోత్తర శత నామావళిలో కేవలం స్తుతి మాత్రమే గాక భగవద్రామానుజుల చరిత్ర ప్రస్ఫుటమవుతుంది. ఒక్కొక్క సన్నివేశాన్ని సమన్వయం చేసిన నామం మనకు కనిపిస్తుంది “అంగీకృత ఆంధ్ర పూర్ణాయ నమః, సాలగ్రామ ప్రతిష్ఠితాయ”నమః అని స్వయంగా తన గురించి తెలిపారు. గొప్ప ఆచార్య ప్రతిపత్తి గల ఆంధ్రపూర్ణులు గురువును భగవంతుని కన్నా మిన్నగా భావించారు. వడుగనంబి సేవాసక్తికి రామానుజులే విస్తుపోయేవారు.

ఒకరోజు ప్రయాణంలో యతీంద్రుల ఆరాధన పెట్టెను, తానారాధించు గురుపాదుకలపెట్టెను ఒకే దగ్గర పట్టుకొని నడుస్తున్నారు ఆంధ్ర పూర్ణులు. కిం కార్యం ఆంధ్ర పూర్ణా2ద్య తవేదం హి కృతం బత! (ఆంధ్ర పూర్ణ! ఇదేమి పని అయ్యో ఇలా చేసావేమిటి?) అని ప్రశ్నించారు. అప్పుడు వడుగనంబి “మీ దేవుని కంటే నా దేవుడు తక్కువ కాదు” అన్నాడట!

మరొకసారి శ్రీరంగనాథ స్వామి నేత్ర సౌందర్యాన్ని సేవించుకొమ్మని చెప్పగా ఆచార్యులనే చూస్తున్న ఆయన “చక్షు రన్యత్ న పశ్యతి” అని యతీంద్ర నేత్ర సౌందర్యం చూసే నా కళ్ళు వేరొకటి చూడలేవు అన్నారట! మరోసారి ఆచార్యుల శేష ప్రసాదం తిని చేతులు కడిగితే అపవిత్రం అని తలకు రాసుకున్నారు. అది చూసి యతిరాజులు కోపించి చేతులు కడుక్కోమన్నారు. అప్పుడలాగే చేసి శ్రీరంగనాధుని నైవేద్య ప్రసాదం స్వీకరించి కూడా చేతులు కడుక్కున్నారట! నంబెరుమాళ్ళ (శ్రీరంగ ఉత్సవ పెరుమాళ్) ఊరేగింపు వీరి నివాసం వద్దకు వచ్చింది. స్వామి నీరాజన సేవకురమ్మని పిలువగా గురువుగారి కోసం పాలుకాచుతూ పాలు పొంగిపోతాయి కావున నేను వెళ్లలేను అని బదులిచ్చారట!, “అధునా మమ దేవస్య క్షీర ముజ్జృంభితం భవేత్ అతోహం న గమిశ్యామి సేవార్థం రంగ భూపతే” ఇప్పుడు నా దైవానికి సమర్పించే పాలు పొంగుతాయి కనుక రంగనాథుని సేవకు వెళ్ళలేను అని బదులిచ్చారట! ఈ అంశం ఎన్నో గ్రంథాల్లో ఆచార్య కైంకర్య నిష్ఠకు నిదర్శనంగా చెప్పబడింది.

ఒకనాడు ఆంధ్ర పూర్ణుల వద్దకు (మిగతా 24 వ పేజీలో)

# శ్రీపతి స్తుతి - సుభాషితం

మంచి మాట


## గజేంద్ర మోక్ష విషయమైన శ్లోకద్వయము

ఉపోద్ఘాతము: మనము గొప్ప ఆపదలో నున్నప్పుడు పరమాత్మను శరణు వేడితే వెంటనే మన బాధ తొలగించి రక్షిస్తారా? ఆ పరమేశ్వరుడు అని సందేహం కలుగుతుంది. దానికి దృష్టాంతంగా 'గజేంద్రమోక్షము' ను తెలుపుచున్నారు. రెండులోకాలల్లో 'గజేంద్రునికి కలిగిన ఆపదయేమిటి? ఏమని ప్రార్థించాడు? భగవానుడు ఏ విధమైన రూపంతో వచ్చాడు? ఎట్లు రక్షించాడు? అనే విషయాలు' సంగ్రహంగా స్పష్టంగా తెలుపడం జరిగింది.

ఆ సందర్భమును పురస్కరించుకొని మరో మూడు శ్లోకాలు (శ్లోకత్రయం) గూడా వున్నవి. మొదట శ్లోకద్వయంలో వున్న విషయాలను విందాము.

1. శ్లో॥ గ్రాహగ్రస్తే గజేంద్రే రుదతి
సరభసం తార్క్ష్య మారుహ్య ధావన్
వ్యాఘూర్ణన్ మాల్యభూషా వసన
పరికరో మేఘగంభీర ఘోషః।
ఆభిభ్రాణో రథాంగం శరమసి మభయం
శంఖ చాపౌ సఖేటౌ
హస్తైః కౌమోదకీ మ ప్యవతు
హరి రసౌ అంహసాం సంహతే ర్నః॥।

ప్రతిపదార్థము: గజేంద్రే = గజేంద్రుడు, సరభసం = గట్టిగా, గ్రాహగ్రస్తే= మొసలి చేత పట్టుకొన బడినవాడై, రుదతి సతి = మొరలిడు చుండగా, తార్క్ష్యం = గరుత్మంతుని, ఆరుహ్య = అధిరోహించి, వ్యాఘూర్ణన్ = గల గలమని పెద్ద ధ్వని చేయుచున్న, మాల్య = మాలికలను, భూష = ఆభరణములను, వసన = పీతాంబరమును, పరికరః = ఇతర పరికరములు గలవాడై, మేఘ = మేఘమువలె, గంభీర = గంభీరమైన, ఘోషః = ధ్వని గలవాడై, రథాంగం = చక్రమును, శరం = బాణమును, అభయం = ఆపన్నులకు అభయమునిచ్చు, అసిం= ఖడ్గమును, సఖేటౌ = డాలుతో పాటు, శంఖచాపౌ = శంఖమును, ధనుస్సును, కౌమోదకీ అపి = కౌమోదకి అనుపేరు గల గదను కూడా, హస్తైః = చేతుల చేత, ఆభిభ్రాణః = ధరించిన వాడై, ధావన్ = మిక్కిలి వేగంతో పరుగిడ వచ్చుచున్న, అసౌ హరిః = ఈ విష్ణుమూర్తి, నః = మనలను, అంహసాం = సమస్త పాపముల యొక్క సంహతేః = గుంపుల (మన శరీరంపై పడకుండ) వలన, అవతు = రక్షించుగాక.



తాత్పర్యము: ఈ గజేంద్ర మోక్ష కథ వ్యాస విరచిత శ్రీమద్భాగవతంలో 8వ స్కందంలో, అట్లే శ్రీవిష్ణు

**శ్రీమాన్ శ్రీ అమరవాది వెంకటనరసింహాచార్యులు**

పురాణంలో వుంది. దానిని పోతనగారు తెలుగు భాగవతంలో అందంగా లలితంగా, హృదయానికి హత్తుకునేట్లు ఈ గజేంద్రుడు తానే ఐనట్లు కనులకు కట్టినట్లు సహజ వర్ణన చేసి ధన్యుడైనాడు. ఇదే ఘట్టాన్ని పరాశర భట్టర్ వారు 'భగవతః త్వరాయై నమః' అంటూ స్వామి తొందరను (మనకు చూపించి) గురించి నమస్కారం అన్నారు. పూర్వాచార్యులు మన పెద్దలందరు గూడా గజేంద్రులము మనమే! మనలనే స్వామి రక్షించ వచ్చినట్లు భావించుకున్నారు. మహాభారతంలో 'ద్రౌపది శరణాగతి', శ్రీమద్భాగవతంలో 'గజేంద్ర శరణాగతి', శ్రీమద్రామాయణంలో 'విభీషణ శరణాగతి'' అంటూ శరణాగతి చేసే వారి విషయంలో తర తమ భేదాలు గుర్తించి ఈ మూడంటిలో విభీషణుని శరణాగతే సర్వశ్రేష్ఠమని నిరూపించినారు. ఆ విషయం మనకు ప్రస్తుతంగాదు. ఈ శ్లోక తాత్పర్యమునే చూద్దాము.

గజేంద్రుడు మొసలి గట్టిగా పట్టుకొని పీడించుచుండగా వేయివత్సరములు పోరాడి ఇంక తనకు శక్తి లేక ప్రాణం పోయే స్థితిలో మొఱపెట్టుకున్నాడు. మూల కారణమైన శ్రీమహావిష్ణువుని గూర్చి. ఆ మొరవిన్న వెంటనే గరుత్మంతునిపై అధిరోహించి స్వామి పరుగున వచ్చినాడు. ఆ వేగంలో ఆయన ధరించిన మాలికలు, ఆభరణములు ఇతర పరికరములు గలగలమని ధ్వనించుచున్నవి. మేఘధ్వని వంటి ధ్వని వ్యాపించుచున్నది. (మిగతా 10 వ పేజీలో)

# శుభాశుభ నిర్ణయాలు-మీమాంస

**(క్రిందటి సంచిక తరువాయి)**

**8. శ్మశాన వాస్తు:**

శ్లో॥ రుద్రేంద్రాన్తర ముచ్చం
స్యాన్నీచం వరుణరక్షసోః।
శ్మశానంనామ తద్వాస్తు
కేవలం కులనాశనం॥

ఈశాన్య తూర్పు దిక్కులు ఎత్తుగా యుండి పశ్చిమనైఋతి దిక్కులు వంపుగా యున్న స్థలమును శ్మశానవాస్తు యందురు. ఈ స్థలమందు గృహ నిర్మాణము జరిపిన కులనాశము కల్గించును.

**9. శ్యేనకవాస్తు:**

శ్లో॥ నీచమగ్నెభవేదుచ్చం
నైఋతీశాన వాయుశః।
శ్యేనకంనామ తద్వాస్తు
నాశాయ మరణాయచ॥

ఆగ్నేయము పల్లముగా యుండి నైఋతి ఈశాన్య వాయవ్య దిక్కులు ఎత్తుగా యున్న స్థలమును శ్యేనకవాస్తు అందురు. ఈ స్థలములో గృహము నిర్మాణము కావించిన నాశము మరణమును కలిగించును.

**10. శ్వముఖవాస్తు:**

శ్లో॥ రుద్రాగ్నివరుణే షూచ్చం
నీచం స్యాన్నిర్‌ఋతౌ తథా।
శ్వముఖం నామ తద్వాస్తు
దారిద్ర్యకారయేత్ఫలం॥

ఈశాన్యాగ్నేయ పశ్చిమదిక్కులు ఎత్తుగా యుండి నైఋతి దిక్కు వంపుగా యున్న స్థలమును శ్వముఖవాస్తు యందురు. ఈ స్థలముమందు గృహనిర్మాణము జరిపిన దారిద్ర్యమును కలిగించును.

**11. బ్రహ్మఘ్నవాస్తు:**

శ్లో॥ నైఋఋత్యగ్నిశివే షూచ్చం నీచం వాతేంద్రయో స్తథా।
బ్రహ్మఘ్నం నామ తద్వాస్తు నేష్టం ప్రాణభృతాంసదా॥

నైఋతి ఆగ్నేయ ఈశాన్య దిక్కులు ఎత్తుగా యుండి వాయవ్య తూర్పు దిక్కులు పల్లముగా యున్న స్థలమును బ్రహ్మఘ్నవాస్తు యందురు. ఈ స్థలములో గృహ నిర్మాణము కావించ కూడదు. ఇది యెల్లప్పుడు నింద్యమే.

**12. స్థావరవాస్తు:**

శ్లో॥ అగ్నెయదిభవేనిమ్న
ముచ్ఛం నిర్‌ఋతిరుద్రయోః।
వాతనిమ్నంచ తద్వాస్తు
స్థావరం కులనాశన॥



**శ్రీమాన్ శ్రీ తిరుమల నల్లాన్ చక్రవర్తుల సంపత్కుమార కృష్ణమాచార్య సిద్ధాంతి**

ఆగ్నేయ దిక్కు ఎత్తుగా యుండి నైఋతి ఈశాన్య వాయవ్య దిక్కులు పల్లముగా యున్న స్థలము స్థావరవాస్తు యందురు. ఈ స్థలములో గృహము నిర్మించిన కులనాశనము కల్గును.

**13. స్థండిలవాస్తు:** శ్లో॥

ఉచ్ఛం నిఋతిభాగేస్యా
న్నీచం జ్వలనవాతయోః।
రుద్రనిమ్నం చ తద్వాస్తు
స్థండిలం నాశయత్యలం॥

నైఋతి దిక్కు ఎత్తుగా యుండి ఆగ్నేయ వాయవ్య ఈశాన్య దిక్కులు పల్లముగా యున్నౖ స్థలము స్థండిలవాస్తు యందురు. ఈ స్థలములో గృహనిర్మాణము కావించిన సర్వనాశనమును కలిగించును.

**14. శాండులవాస్తు:**

శ్లో॥ రుద్రోచ్ఛం యదినిమ్నం స్యా
ద్వహ్నౌ నిర్‌ఋతి వాతయోః।
శాండులం నామ తద్వాస్తు
ప్రాపయత్వ శుభంసదా॥

ఈశాన్య భాగము ఎత్తుగా యుండి ఆగ్నేయ నైఋతి వాయవ్య భాగములు పల్లముగా యున్న స్థలమును శాండుల వాస్తు యందురు. ఈస్థలమందు గృహ నిర్మాణము జరిపిన యెల్లప్పుడు అశుభములు కలుగును.

**నాగ పృష్ఠ భూమి:**

శ్లో॥ పూర్వపశ్చిమయోర్దీర్ఘా
దక్షిణోత్తరఉచ్ఛ్రతాః।
నాగపృష్ఠం విజానీయా
త్కర్తు రుచ్చాటనం భవేత్॥

తూర్పు పడమరలు దీర్ఘముగా వుండి దక్షిణ ఉత్తరములు ఎత్తుగా వున్న భూమిని నాగపృష్ఠ భూమి యందురు.

శ్లో॥ నాగపృష్ఠే యదావాసో
మృత్యురేవ న సంశయః।
పత్నీహానిః పుత్రహానిః
శతృవృద్ధిః పదేపదే॥

నాగపృష్ఠ భూమి యందు గృహనిర్మాణము కావించి అందులో నివాసమున్నచో యజమానికి మరణము, భార్యానాశము, పుత్రనష్టము శతృవృద్ధి తరచు కలుగును.

**దైత్య పృష్ఠభూమి:**

శ్లో॥ పూర్వా2గ్ని2శ కోణేషు ఉన్నతిశ్చయదాభవేత్।
పశ్చిమేచయదానీయం దైత్యపృష్ఠో2భిధీయతే॥
దైత్యపృష్ఠే తృతే వాసే లక్ష్మీర్నాయాతిమందిరం।
ధనపుత్ర పశూనాంచ హానిరేవన సంశయః॥

తూర్పు ఆగ్నేయ ఈశాన్య భాగములు ఎత్తుగా వుండి పశ్చిమభాగము పల్లముగా యున్న స్థలమును దైత్యపృష్ఠ భూమి యందురు. ఈ స్థలమందు గృహ నిర్మాణము చేసి నివసించిన ధనముండదు, పుత్ర సంతానమునకు పశువులు మొదలగు వాటికి నాశనము కలుగును.

**కూర్మపృష్ఠభూమి:**

శ్లో॥ మధ్యేతూచ్చం భవేద్యత్ర నీచం చైవచతుర్దిశం।
కూర్మపృష్ఠం విజానీయా త్తత్ర వాసం సమాచరేత్॥
కూర్మపృష్ఠే భవేద్యాసో నిత్యోత్సాహో సుఖ ప్రదః।
ధనం ధాన్యం భవేత్తస్య నిశ్చితం విపులం శుభమ్॥

స్థలము మధ్యభాగము ఎత్తుగా యుండి నాల్గుదిశలయందు పల్లముగా యున్న స్థలము(భూమి)ను కూర్మపృష్ఠ భూమియందురు. యిట్టి స్థలమందు గృహ నిర్మాణము కావించి నివాసమున్న యెడల ఎల్లప్పుడు ఉత్సాహము. సుఖము, ధనధాన్య ప్రాప్తి, శుభములు కలుగును.

**గజపృష్ఠ భూమి:**

శ్లో॥ దక్షిణే పశ్చిమే చైవ నైఋత్యాం వాయుకోణకే।
ఏభిరుచ్చా భవేద్భూమి ర్గజపృష్ఠోభిధీయతే॥
గజపృష్ఠే భవేద్వాస సలక్ష్మీ ధనపూరితః।
ఆయుర్వృద్ధి కరీ నిత్యం జాయతే నాత్ర సంశయః॥

స్థలము దక్షిణ, పశ్చిమ. ఆగ్నేయ, నైఋతి వాయవ్యములు ఎత్తుగా యుండి మిగతాదిక్కులు పల్లముగా యున్న భూమి గజపృష్ఠ మందురు. యీస్థలమందు గృహ నిర్మాణము కావించి నివాసము జరిపిన ఐశ్వర్యము. ఆయుర్వృద్ధి, సుఖము కలుగును. (జ్యోతిర్నిబంధం)

శ్లో॥ ప్రాసాదారంభకాలే తు
గృహాదౌచ విశేషతః।
శల్యోద్ధారస్తు కర్తవ్యో
యదిచ్ఛే చ్ఛుభ మాత్మనః॥

గృహము గాని ప్రాసాదము గాని నిర్మించుటకు పూర్వము శుభములను పొందుటకు గాను ఎముకలు త్రవ్వి తీయవలయును.

శ్లో॥ తత్ర వాసం న కుర్వీత గృహం చైవ నకారయేత్।

శల్యములు గల స్థలము యందు గృహనిర్మాణము చేసి అందులో నివాసము చేయకూడదు.

శ్లో॥ యదానజ్ఞాయతే శల్యం గృహారంభణ కర్మణి।
ఫలసాకే నశల్యం తం జ్ఞాతవ్యం కర్మవేదిభిః॥
నశల్యే వాస్తు సదనే పూర్వం దుస్స్వప్నదర్శనం।
హానిర్వా రోగమతులం ధననాశస్త దైవచ॥

గృహ నిర్మాణము ప్రారంభించడానికి ముందుగా స్థలములో శల్యములను పరిశీలించవలయును. శల్యములున్న స్థలములో గృహ నిర్మాణము జరిపి నివాసమున్న దుస్వప్నములు, రోగములు, ధననాశనము, హానియు కలుగును. శల్యములు లేని స్థలములో గృహ నిర్మాణము జరిపి అందులో నివసించిన ఆరోగ్యము, సుఖము, ఐశ్వర్యము వంశవృద్ధి మొదలగు శుభ ఫలితములుండును. కావున గృహ నిర్మాణము చేయు స్థలము శల్యములున్నదీ లేనిది తెలుసు కొని శల్యములున్న వాటిని తీసి గృహనిర్మాణము చేసుకొన వలయును.

**శల్య స్వరూపము:**

శ్లో॥ శల్యానేకవిధాః ప్రోక్తా ధాతు కాష్ఠాస్థి సంభవాః।

ధాతు, కాష్ఠ, అస్థి సంభవములగు శల్యములనేక స్వరూపములతో నుండును. ఇనుము మున్నగు లోహ శకలములు కట్టెలు, ఊక, బొగ్గులు, ఇటుకలు, బూడిద, ఎముకలు మొదలగు వాటిని శల్యములనబడును.


**(మరికొన్ని విషయాలు వచ్చే సంచికలో)**

# భాగవతంలో భగవంతుని అవతార గాథలు

## దత్తాత్రేయ అవతారం

అప్పుడు దత్తాత్రేయుడు, "వత్సా! శరీరంలోని పరమజ్ఞానానికి గురువే ఉపద్రష్ట. మోక్షం కోరేవారికి యోగం జ్ఞానం వల్ల తెలుస్తుంది. ప్రకృతిగుణాలతో ఏకత లేకపోవటం, బ్రహ్మలో ఏకం కావటం ఇదే మోక్షం. ఆ మోక్షం పరమయోగం వల్ల కలుగుతుంది. ఆ యోగం సంగత్యాగం వల్ల సిద్ధిస్తుంది. సంగత్యాగం వల్ల నిర్మలత్వం దేని మీదా మమకారం లేకపోవటం, దాని వల్ల వైరాగ్యం, దాని వల్ల జ్ఞానం, ఆ జ్ఞానం వల్ల మోక్షం కలుగుతాయి.

"యోగి ముందుగా ఆత్మను జయించాలి. కనుక, ప్రాణాయామంతో ఆత్మ ధరించిన దేహంలోని దోషాలను దహించాలి. కోరికల వల్ల పుట్టిన కర్మలు యోగసాధనకు విఘ్నం కలిగిస్తాయి. కావున వాటిని వదలిపెట్టి శుద్ధాత్ముడు కావాలి అప్పుడు పరమాత్మలో కలసిపోతాడు. అలాటి యోగికి గౌరవం విషం, అవమానమే అమృతం అవుతాయి. అతడు తనకు ఉన్నదాన్నే ఇల్లుగా, దొరికినదే భోజనంగా, తనకు ఉన్నదాన్నే ధనంగా భావించి సంతోషంగా ఉంటూ, మమకారం పొందడు. కనుక, నీవు కూడా విచారం వదలిపెట్టి, అటువంటి యోగపురుషుడివి కావాలి. మోక్షవృత్తిని మాత్రం మరవకు!" అని బోధించాడు.



అలర్కుడు బ్రహ్మానందంతో తన గృహానికి తిరిగివెళ్ళి, రాజ్యాన్ని ప్రేమతో కాశీరాజుకు ఇచ్చాడు. దానిని ఆ కాశీరాజు, అలర్కుని అన్నకు ఇవ్వబోయాడు.

అతడు ఆనందించి, "నేను నా సోదరునికి జ్ఞానబోధ చేయడానికే రాజ్యం అర్థించాను. ఆ పని ముగిసిపోయింది కనుక, నాకు రాజ్యం అవసరం లేదు" అని చెప్పాడు. ఆ కాశీరాజుకు కూడా తత్త్వోపదేశం చేసి, తన ఆశ్రమానికి తిరిగి వెళ్లిపోయాడు.

కాశీరాజు అలర్కుణ్ని పూజించి, ఆ రాజ్యాన్ని అతనికే వదలిపెట్టి, వెళ్లిపోయాడు. అలర్కుడు, తన పుత్రుణ్ని రాజును చేసి, యోగి, విరాగీ అయిపోయి, ఆత్మసుఖం పొందాడు.

దత్తాత్రేయ మహర్షి సంగ పరిత్యాగం చేయడానికి, రకరకాలుగా వేషధారణ చేసేవాడు. విల్లమ్ములు చేతబట్టి, శునకాలు తన వెంట వస్తుండగా, చెంచువాని వలె గోచరించేవాడు. కారడవిలో కిరాతుల గుంపులు ఉండే చోట తానూ ఉంటూ, మద్యమాంసాలు సేవిస్తూ



**శ్రీమతి తిరుమల నీరజ**

ఉండేవాడు. మాలపల్లెకు వెళ్లి, చండాలురతో కలసి ఉంటూ వారితో మద్యసేవనం చేసేవాడు. ఉన్మత్తు డైనట్లు పిచ్చివాని వలె విహరిస్తుండేవాడు. ఏమైనా దత్తాత్రేయమహర్షి మాత్రం మనకు అంతు పట్టని మహా యోగేశ్వరేశ్వరుడు! విచిత్ర మైన చరిత్ర కలవాడు!

(దత్తాత్రేయ అవతారగాథ సంపూర్ణం)

## <u>సుయజ్ఞుని అవతారం</u>

శ్రీమహావిష్ణువు అవతారాలలోను యజ్ఞావతారం గురించి మునుపు కొంచెమే చెప్పుకున్నాం. సంస్కృత శ్రీమద్భాగవతం లో సుయజ్ఞావతారం గూర్చి మరి కొన్ని వివరాలు ఉన్నాయి. వాటిని కూడా తెలుసుకొందాము.

స్వాయంభువమనువు, తన భార్య ఐన శతరూపాదేవి అంగీకారంతో, తన కుమార్తె ఆకూతిని రుచిప్రజాపతికి ఇచ్చి వివాహం చేశాడు. ఆ దంపతికి ఒక పుత్రుడు, ఒక పుత్రిక కలిగారు.

ఆ పుత్రుడు, స్వయంగా శ్రీమహావిష్ణువే. ఆయన వేదాలలో చెప్పిన యజ్ఞాలకు ప్రతీక ఐన యజ్ఞుడు అనే పేరుతో ఆ బాలుడుగా అవతరించాడు. ఇక శ్రీమహాలక్ష్మీదేవి, స్వామికి

# భాగవతంలో భగవంతుని అవతార గాథలు

నిత్యానపాయిని ఎన్నడూ స్వామిని విడచిపెట్టి ఉండనిది కనుక, ఆమె తన ఒకానొక అంశతో దక్షిణ అనే బాలిక రూపంలో జన్మించింది. ఆ బాలిక, యజ్ఞంలో ఋత్విక్కులకు యజమాని ఇచ్చే ధనానికి ప్రతీక. సాక్షాత్తుగా శ్రీమహాలక్ష్మి కదా మరి!

మనువు, తన కూతురైన ఆకూతిని రుచిప్రజాపతికి ఇచ్చినప్పుడు, స్వాయంభువమనువు ఒక నియమం ఏర్పరచాడు. అది ఏమిటంటే, వారికి జన్మించే మొట్టమొదటి పుత్రుణ్ని తనకే ఇవ్వాలి అని. దీనికి "పుత్రికాధర్మం" అని పేరు. అప్పటికి స్వాయంభువుకు ప్రియవ్రతుడు, ఉత్తానపాదుడు అనే ఇద్దరు తనయులు ఉన్నారు. ఐనా ఆ నియమంతోనే ఆకూతిని రుచికి ఇచ్చాడు. ఆయనా దానికి సమ్మతించాడు.

యజ్ఞుడు పుట్టగానే, మనువు ఎంతో ఆనందించి, ఆ యజ్ఞుణ్ని తన గృహానికి తెచ్చుకొన్నాడు. ఆ బాలుడు తన కాంతులతో పరిసరా లన్నిటినీ ప్రకాశింపజేస్తుండేవాడు. దక్షిణ మాత్రం రుచి, ఆకూతుల వద్దే పెరిగింది.

మంత్రాలకు, యజ్ఞాలకు ప్రభువైన విష్ణుభగవానుడు, అక్కడ యజ్ఞుని రూపంలో ఉండేవాడు. ఆయనపై లక్ష్మీదేవికి అనురాగం కలిగింది. ఆయన, ఆమెను వివాహం చేసుకొన్నాడు. ఆనందంతో జీవితం గడపిన ఆ ఇరువురికీ, పన్నెండుగురు కుమారులు కలిగారు.

వారి పేర్లు క్రమంగా తోషుడు, ప్రతోషుడు, సంతోషుడు, భద్రుడు, శాంతుడు, ఇడస్పతి, ఇధ్ముడు, కవి, విభుడు, స్వహ్నుడు, సుదేవుడు, రోచనుడు.

స్వాయంభువమనువు పాలించిన మన్వంతరంలో ఈ పన్నెండుగురే తుషితులు అనే పేరున్న దేవతలుగా, మరీచి మొద లైనవారు మహర్షులుగా ఉండేవారు. యజ్ఞుడే దేవగణాలకు ప్రభువైన ఇంద్రు డయ్యాడు. ఇతనికే సుయజ్ఞుడు అని కూడా నామాంతరం.


ఇక శ్రీమన్నారాయణుని తరువాతి అవతారం. ఇందులో స్వామి నాలుగు రూపాలున్న నలుగురు మహర్షులుగా అవతరించాడు. వారి పేర్లు సనకుడు, సనందనుడు, సనత్కుమారుడు, సనత్సుజాతుడు. వీరే విధంగా అవతరించారో తెలుసుకొందాం.

శ్రీవిష్ణుమూర్తి నాభికమలం నుండి ఉద్భవించిన బ్రహ్మదేవుడు, చాలా కాలం మహాతపస్సు చేసి, ఈ సృష్టి ప్రారంభంలో "అహం" అనే దేహాభిమానబుద్ధి ఐన మోహాన్ని, స్త్రీసంగమం, తదితరాలైన కింది స్థాయి భోగాలపై ఇచ్ఛ ఉన్న మహామోహాన్ని, ఆ మోహానికి అడ్డు వస్తే పుట్టే క్రోధం వల్ల అంధతామిస్రాన్ని, దాని నాశనం చేత తామిస్రాన్ని, చిత్తవిభ్రమను, మరి కొన్ని అవిద్యాపంచకమిశ్రంగా అజ్ఞానం వల్ల పుట్టే ప్రాణులు సర్వభూతాలనూ పుట్టించాడు. ఆ పైన ఇంతటి పాపం నిండిన సృష్టి చేసినందుకు పశ్చాత్తాపం పొందాడు. భగవత్ ధ్యానంతో మనస్సు పవిత్రం చేసుకొని, ఊర్ధ్వరేతస్కులు, పరమ పవిత్రులు, సత్త్వగుణంలో అందరినీ మించినవారు, జనులలో అతిధీరులు ఐన సనక, సనందన, సనత్కుమార, సనత్సుజాతులనే మహామునులను సృష్టించాడు. ఈ విధంగా ఈ నలుగురినీ బ్రహ్మదేవుడు, తన మానసాంభోజం మనస్సు అనే కమలం నుండి పుట్టించాడు. వారు నలుగురూ బ్రహ్మమానస పుత్రులుగా ఘనకీర్తిని గడించారు.

అప్పుడూ విరించి బ్రహ్మ "వత్సలారా! మీ రందరూ మీ మీ అంశలతో ప్రజలను సంతానాన్ని పుట్టించండి. అట్లా చేస్తే సృష్టికార్యంలో నాకు సహాయం చేసినవారవుతారు" అన్నాడు.

వారు ఆయనను పరిహాసం చేసి, "తండ్రీ! మాకు ఈ సృష్టితో కానీ, నీతో కానీ ఏ పనీ లేదు. ప్రపంచనిర్మాణ మనేది నీ కర్మయే నీత కార్యం కానీ, మా పని కాదు. నీవు నిరంతరం భగవత్ ధ్యానామృతంలో మునిగి మమ్మల్ని సృష్టించావు. అందుచేత, మేము ఆ భగవత్ ధ్యానమే రూపాలై నీ కిట్లా జనించాము. మోక్షం పొందడమే మా ధర్మం. నారాయణపారాయణ పరాయణులం. మాకే ఇతర విషయాలూ రుచించవు. అంటే భగవన్నామస్మరణ తప్ప, ఇతరవిషయాల మీద మాకు ఆసక్తి లేదు. నీ గతి నీది, మా గతి మాది. మేము జనలోకానికి వెళ్లి అక్కడే ఉంటాము. కామరూపులమై మేమే రూపం కోరుకొంటే అది మాకు వస్తుంది. అన్ని లోకాలకూ ఆ విద్యతో తిరుగుతూ ఉంటాము. ఎల్లప్పుడూ హరిధ్యాన తత్పరులమై ఉంటాము. నీవు ఎప్పుడు తలచుకొంటే అప్పుడు వచ్చి నీకు మేలు చేస్తాము" అన్నారు. అటు పైన ఆ దివ్యదేహులు జనలోకానికి వెళ్లి అక్కడే ఉంటున్నారు. (సశేషం)

# శిష్యాచార్య సంబంధము



శ్రీమాన్ శ్రీ సముద్రాల శఠకోపాచార్యులు, వరంగల్

విలువైన మానవ జీవితాన్ని సార్థకం చేసుకునేందుకు ఉపకరించే సత్సంబంధాలలో ముఖ్యమైనది, పరమ పవిత్రమైనది శిష్యాచార సంబంధమే. సదాచార్య సంబంధము వల్లనే శిష్యులు ఉద్ధరింపబడుతారు. అట్లే సచ్ఛిష్యులవల్లనే సదాచార్యుల ఉపదేశాలు సార్థక్యాన్ని పొందుతాయి.

శిష్యాచార్యులు అనగానే మనకు వెంటనే మనసులో కొందరు స్ఫురిస్తారు. అలాంటి ముఖ్యులను గురించి కొంచెం వివరించుకుందాము. 1. విశ్వామిత్ర మహర్షి, శ్రీరామచంద్రమూర్తి. 2 ఆంజనేయస్వామి, సీతాదేవి. 3 భగవద్రామానుజులు, కూరేశులు. 4. శ్రీరామకృష్ణ పరమహంస, వివేకానందులవారు.

శిష్యుల ఆత్మోద్ధరణ ఆచార్యుల కృత్యమైతే, ఆచార్యుల దేహరక్షణ, శరీరపోషణలు శిష్యుల కర్తవ్యములు. దశరథ మహారాజు శ్రీరాముణ్ణి “ఊన షోఢశవర్షో మే రామో రాజీవ లోచనః” అంటూ సుకుమారుడిగా, సుందరుడిగా భావిస్తూ అల్లారుముద్దుగా పెంచుతూ ఉన్నప్పుడు విశ్వామిత్రులవారు వచ్చి తన యాగ సంరక్షణకు రామలక్ష్మణులను తన వెంట పంపమని దశరథుణ్ణి అభ్యర్థించిరి. ఈ బాలురైన రామలక్ష్మణులు రాక్షసులతో యుద్ధం చేయుటమా అని దశరథుడు సందేహిస్తున్నప్పుడు నీపుత్రులు సామాన్య బాలకులు కారని “అహం వేద్మి మహాత్మానం రామం సత్య పరాక్రమమ్” వారి బలపరాక్రమాలు అసామాన్యమైనవని విశ్వామిత్ర మహర్షి పేర్కొని దశరథుడి అంగీకారముతో తన వెంట రామలక్ష్మణులను తీసుకొని వెళ్ళే సమయంలో ఆచార్య కృత్యముగా బల, అతిబల మొదలైన విద్యలను ఉపదేశించెను. ఆ తరువాత శ్రీరామావతార పరమ ప్రయోజనమైన రావణ కుంభకర్ణాది దుష్టశిక్షణ కొరకు సుగ్రీవ, విభీషణాదులు అనే శిష్యుల రక్షణకు శ్రీరామునికి సీతాదేవి యొక్క తోడ్పాటు అత్యవసరం కనుక సీతారాముల వివాహాన్ని కూడా జరిపించెను.

శిష్యులైన శ్రీరామలక్ష్మణులు “ఇమౌస్మ మునిశార్దూల కింకరౌ సముపస్థితౌ” అంటూ తమ శిష్య ధర్మాన్నిపాటిస్తూ అనుల్లంఘనీయమైన ఆచార్యాజ్ఞను నిర్వహిస్తూ రాక్షసుల గర్వమణచిరి.

శ్రీరామాయణ రత్నమాలికలో నాయకమణివలె ప్రకాశించే ఆచార్య స్వరూపుడైన హనుమంతుడు జీవకోటికి చెందిన సీతాదేవికి శ్రీరామచంద్ర ప్రభువు యొక్క క్షేమాన్ని తెలిపి, రామనామాంకితమైన అంగుళీయకాన్ని ఇచ్చి, ప్రాణత్యాగానికి సిద్ధపడిన సీతాదేవిని శ్రీరామచరితామృతాన్ని అందించి ఆమెను రక్షించెను.

సీతాదేవి గుర్తుగా ఇచ్చిన చూడామణిని, నోటితో చెప్పిన కాకాసురుడి వృత్తాంతాన్ని శ్రీరామునికి నివేదించి సీతారాములు అనే జీవాత్మ పరమాత్మల కలయికకు అవసరమైన ప్రధాన భూమికను పోషించి జీవుణ్ణి దేవుణ్ణి ఒక్క దగ్గరకు చేర్చే బాధ్యతను (ఘటక కృత్యమును) (ఆచార్యకృత్యమును) హనుమంతుడు నిర్వహించెను.

శ్రీరామగుణామృతంతో తన ఆత్మరక్షణ చేసిన ఆచార్యుడైన హనుమంతుని తోకకు రాక్షసులు నిప్పటించినప్పుడు ఆచార్యుల దేహరక్షణ శిష్యుల కర్తవ్యము అనే నియమాన్ని అనుసరించి ‘శీతోభవ హనూమతః’ అని పేర్కొంటూ తన పాతివ్రత్య విషయముగా ఒట్టు పెట్టుకుంటూ అగ్ని చల్లారునట్లు చేసినది. సీతాదేవి తన పాతివ్రత్య మహిమను హనుమద్రక్షణకు ఉపయోగించినది.. అంతేకాని రావణాసురుని శిక్షించుటకు, తనను తాను రక్షించుకొనుటకు ఉపయోగించలేదు. ఎందుకంటే తన ప్రభువైన శ్రీరాముడే తనను రక్షించాలి. రావణాసురుణ్ణి శిక్షించాలి అనే స్వరూప జ్ఞానంతో సీతాదేవి ప్రవర్తించినది.

అంతేకాక తనకు శ్రీరామరక్ష లభించునట్లు “వాచా ధర్మమవాప్నుహి” తగిన (పురుషకారమును) మాట సహాయమును మాత్రము తప్పక చేయుమని ఆచార్య పుంగవుడైన హనుమంతుణ్ణి ప్రార్థించినది.

శ్రీవైష్ణవ సంప్రదాయమునకు చెందినవారందరికీ ప్రాతఃస్మరణీయులైన కూరేశులు భగవద్రామానుజులు ఉత్తమ

శిష్యాచార్య సంబంధానికి సీమాభూమిగా చెప్పదగినవారు.

భగవత్ సంబంధంకన్న ఆచార్య సంబంధమే మిన్న అన్న విషయాన్ని ఆచరణలో చూపారు. ఆచార్యులైన భగవద్రామానుజులకు క్రిమికంఠుడనే రాజు వల్ల ఎటువంటి ఆపద సంభవించకుండా ఉండాలని భావించి యతిరాజుల కాషాయవస్త్రాలను తాను ధరించి చోళరాజ సభకు వెళ్ళారు.

కూరేశులు శాస్త్ర ప్రమాణాలతో, యుక్తులతో వాదములో గెలిచి శ్రీమన్నారాయణుడే పరతత్త్వమని నిరూపించి రాజాగ్రహానికి గురై నేత్రములను కోల్పోయినారు. తమకు ఎంతటి ఆపద సంభవించినా పర్వాలేదు. విశిష్టాద్వైత సిద్ధాంత ప్రచార రథసారథులైన భగవద్రామానుజాచార్య స్వామికి ఎటువంటి ఆపద కలుగవద్దని భావించిన సచ్ఛిష్యులు కూరేశులు.

ఉత్తమాచార్యులైన భగవద్రామానుజులు, తమ గురువుగారి దగ్గర శ్రద్ధాసక్తులతో 18 సార్లు తిరిగి గురువుగారి అనుగ్రహానికి, అభిమానానికి పాత్రులై సంప్రదాయ రహస్యజ్ఞానాన్ని ఉపదేశంగా పొందారు. గురువుగారు భగవద్రామానుజులతో ఎంతో ప్రాధాన్యం కలిగిన ఈ రహస్యార్థమును ఎవ్వరికీ చెప్పవద్దని ఆదేశిస్తే, అయ్యా పవిత్ర స్థానీయులైన కూరేశులకు చెప్పకుండా ఉండలేను అని పేర్కొన్న శిష్య వాత్సల్య పూర్ణులైన ఆచార్యులు భగవద్రామానుజులు.

ఉత్తమాచార్యులైన భగవద్రామానుజ సంబంధం కలవారికే మోక్షమని పరమాత్మ పేర్కొన్నాడు. కూరేశులు, వడుగనంబి, దాశరథి, అనంతాళ్వాన్ మొదలైన శిష్యులందరూ విశ్వసించారు. అయితే ఆచార్యులైన భగవద్రామానుజులు మాత్రం సచ్ఛిష్యులైన కూరేశుల సంబంధముతో తమకు మోక్షము తప్పక లభిస్తుందనే నిశ్చయాన్ని కలిగియున్నారు. శ్రీభాష్యరచనలో తప్పులు దొర్లితే వాటిని సవరించమని ఆచార్యులైన శ్రీరామానుజులు, శిష్యులైన కూరేశులతో పలికారు. వైకుంఠములో తాము ముందుగ ప్రవేశించి, తర్వాత విచ్చేసే ఆచార్యులైన శ్రీరామానుజులకు స్వాగత సత్కారాలను సమర్పించాలని కూరేశులు భావించి శ్రీరంగనాథుని అనుగ్రహంతో ముందుగ వైకుంఠానికి చేరిన సచ్ఛిష్యులు కూరేశులు. ఉత్తమశిష్యాచార్యులైన వీరిద్దరి గురించి వివరించుటకు ఎవరికైనా సమయం చాలదు. శక్తి సరిపోదు. మాటలు అందవు అనడం ఎంతమాత్రం అతిశయోక్తి కాదు.

శ్రీరామకృష్ణ పరమహంస. అనే సద్గురువులు స్వామి వివేకానంద అనే సచ్ఛిష్యులు శిష్యాచార్య సంబంధ వైభవము చరిత్రలో స్థిరంగా శాశ్వతంగా నిలిచేటట్లు, తరతరాల వారికి ఆదర్శప్రాయమగునట్లుగా జీవనయాత్రను కొనసాగించారు. మానవాళికి మహోపకారమైన, సహజ సుందరమైన శిష్యాచార సంబంధము సుచిరకాలం స్వచ్ఛమైన మణిహారంవలె గొప్పగా ప్రకాశించాలని ఆకాంక్షిద్దాం. ★

# గోదా స్తుతి



**శ్రీమాన్ శ్రీ చిలకమర్తి కృష్ణమాచార్యులు, కోదాడు**

శ్రీభట్టనాథ హృదయాంచితహర్షరూపాం
శ్రీకృష్ణభక్తిపరిపూరితకల్పవల్లీమ్
శ్రీపూర్ణధన్విపురశోభితయోగదృశ్యాం
ఆముక్తమాల్యదమహంప్రణమామినిత్యమ్ .1

లక్ష్మీసఖీం భువనమోహనమోహనాంగీం
నారాయణాభిమతసాధనదివ్యదీక్షామ్
భక్తావనాం హరిపదార్చనపుణ్యధాత్రీం
గోదాం మురారిదయితాం సతతంభజేహమ్. 2



తులసీవనసంభూతాం
కలికల్మష నాశినీమ్
శ్రీకృష్ణభామినీం వందే
గోదాం ముక్తి ప్రదాయినీమ్ .3

శ్రీవ్రతదాయినీం దేవీం
శ్రీనాథసేవనపరామ్
భక్తజనవిరోధఘ్నాం
విష్ణుచిత్తాత్మజాం భజే .4

యాకీర్తయదసామాన్యం
త్రింశద్గీతైః పరాత్పరమ్
కృష్ణార్పిత సుహృజ్జీవం
తాం గోదాం నౌమి భూసుతామ్. 5

**శ్రీసంప్రదాయ సేవలో**

# శ్రీ రామానుజ యాజ్ఞిక పీఠం





మానవ మనుగడను, ప్రకృతి సంరక్షణను కూడా ఆధ్యాత్మిక సేవాచరణ ప్రభావిత పరుస్తుంది. యుగాలుగా శాశ్వతమైన భారతదేశ పవిత్రతకు మూలము ఆధ్యాత్మిక శక్తి. అన్ని వర్గాల ప్రజలను సంఘటిత పరిచేందుకు పరస్పర సహకారానికి ఆధ్యాత్మిక సేవాచరణయే దోహదపడుతుంది. ఆ విధంగానే హిందూ ధర్మ పరిరక్షణ ఆకాంక్షిస్తూ స్థాపించబడిన ఆధ్యాత్మిక సేవా సంస్థ శ్రీ రామానుజ యాజ్ఞిక పీఠం. 1998లో హైదరాబాదులో శ్రీమాన్ శ్రీ విద్యుల్లత ప్రవీణ్‌కుమారా చార్యుల వారిచే స్థాపించబడింది. ఆధ్యాత్మిక చింతనను, సేవాచరణను సమాజంలో పెంపొందించుట, చాతుర్ వర్ణ్యాల వారిలోనూ ఆధ్యాత్మిక చింతనను పెంచడం, సనాతన ధర్మం పరిరక్షించుకోవాలనే ధృఢ సంకల్పంతో స్థాపించారు. ఎంతోమంది పెద్దలు ఆచార్యుల ఆశీస్సులతో ప్రారంభించ బడిన శ్రీ రామానుజ యాజ్ఞిక పీఠం ఆనాటి నుండి గొప్ప సేవలను అందిస్తున్నది. ప్రారంభంలో “ఆసేతు హిమాచల యజ్ఞాచార్యులు” శ్రీ పాంచరాత్ర ఆగామశాస్త్ర పండితులు శ్రీ ఉ.వే. శ్రీమాన్ కీ.శే.చిలకమర్రి శ్రీనివాసాచార్యస్వామి వారు గౌరవ అధ్యక్షులుగా, గౌరవ సలహాదారులుగా ఉన్నారు. శ్రీ వైఖానస ఆగమశాస్త్ర పండితులు శ్రీ ఉ.వే శ్రీమాన్ కీ.శే. అగ్నిహోత్రం వరదరాజా భట్టాచార్య శర్మ గారు ప్రధాన కార్యదర్శిగా తెలంగాణలో శేషం మురళీమోహనాచార్యులు ఆంధ్రప్రదేశ్‌లో అగ్నిహోత్రం జగన్నాథాచార్యులు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు శ్రీమన్ శ్రీ విద్యుల్లత ప్రవీణ్ కుమారచార్యులు.

విశ్వశాంతి గురించి లోకకళ్యాణార్థం సమైక్యత సమృద్ధి సుభిక్షం హిందూధర్మ పరిరక్షణ ఆకాంక్షిస్తూ 1998లో శ్రీవిభవ నామ సంవత్సరం శ్రావణమాసంలో శ్రీమాన్ చిలకమర్రి శ్రీనివాసాచార్యుల శ్రీ హస్తములచే చతుర్వేద మహాయజ్ఞము నిర్వహించబడినది.

ఈ సంవత్సరం 2024 సెప్టెంబర్ 3 నుండి శ్రావణ మాస ఉత్సవాలు నిర్వహించ బోతున్నారు.

యజ్ఞ యాగాది క్రతువుల నిర్వహణ. పర్వదిన ఉత్సవములు, తిరునక్షత్ర మహోత్సవాలు, దేవాలయ బ్రహ్మోత్సవ నిర్వహణలు, దివ్య క్షేత్రాల్లో ఉత్సవ సేవలు, సామాజిక సేవా కార్యక్రమాలు, కరోనా వంటి విపత్కర సమయంలో ఆర్థిక సహకారం సామాజిక సేవలను అందించుట. జీయర్ స్వాముల ఆధ్యాత్మిక కార్యక్రమ సేవలలో సమన్వయించుట. ఇత్యాది అనేక కార్యక్రమాలను నిర్వహిస్తూ (25 సంవత్సరాలుగా) సుదీర్ఘ కాలంగా ఆధ్యాత్మిక సేవల నందిస్తున్నది “శ్రీరామానుజ యాజ్ఞిక పీఠం” ★











# కృష్ణం వందే జగద్గురుం

సర్వకాల సర్వావస్థలయందును సమస్తమానవులకు జీవిత సత్యాన్ని తెలియ చెబుతుంది. జీవనగమనంలో సన్మార్గాన్ని నిర్దేశిస్తుంది. అందుకే సాక్షాత్ భగవంతుని ముఖోద్గీతమైన భగవద్గీత గీతాశాస్త్రంగా వాసికెక్కింది. గీతాసూక్తులను జీవిత సత్యాలుగా మీ శ్రీసన్నిధానంలో ఆస్వాదించండి!



**శ్రీమాన్ ఆచి వేంకట పాండురంగాచార్య**

మనిషి సహజముగానే సత్వరజస్తమోగుణమయ ప్రకృతిచే ప్రభావితుడవుతాడు. ఆహార విహారాదులు, సంస్కారము మనిషి యొక్క గుణములను నిర్దేశిస్తాయి. ఆయా గుణములు మనిషి యొక్క వ్యవహారమును నిర్దేశిస్తాయి.

గీతాశాస్త్రము వర్ణ వ్యవస్థను మనిషి యొక్క గుణము, సంస్కారము, వ్యవహారము, సామర్థ్యములను బట్టియే విభజన చేసింది. కానీ మరొక కారణము కానే కాదు. కర్మలన్నీ పవిత్రములే.

"కర్మాణి ప్రవిభక్తాని స్వభావ ప్రభవైః గుణైః"

"శ్రేయాన్ స్వధర్మో విగుణః"

వర్ణములలో ఉచ్చ నీచ భేదము లేదు.

"పితా అహం అస్య జగతః"

"సమోహం సర్వ భూతేషు"

ఈ జగత్తుకు కారణం పరమాత్మ. పరమాత్మకు అందరూ సమానులే. అందరూ భగవత్ప్రాప్తికి అర్హులే. ఈ విషయము గీత స్పష్టముగా చెప్పింది.

"స్వే స్వే కర్మణి అభిరతః
సంసిద్ధిమ్ లభతే నరః"

తమ తమ కర్మలయందు తత్పరులై ఉన్నవారే సంసిద్ధిని పొందుతారు.

ప్రాచీన కాలములో ఒక పటిష్ఠమైన ప్రణాళికాబద్ధమైన వర్ణ ఆధారిత ఆర్థిక వ్యవస్థ ఉండేది. తద్వారా పరస్పర సహకార సమాజ జీవనము, శాంతి, సంపూర్ణ సామాజిక సామరస్యము ఉండేవి. కాలక్రమేణ కుల వృత్తి ఆధారిత గ్రామీణ ఆర్థిక వ్యవస్థ కూలిపోయింది. పట్టణీకరణ, పారిశ్రామికీకరణ ప్రభావము పెరిగింది. దాని వలన సమాజము మానసిక క్షోభకు గురి అవుతున్నది. శాస్త్ర ఉల్లంఘన వలన సమాజం అనర్థము పాలవుతున్నది.

"యోగః కర్మసు కౌశలం" అని బుద్ధి యోగముతో కర్మలయందు ప్రావీణ్యత పొంది అత్యధిక ఉత్పత్తి, దానము, అపరిగ్రహము (అవసరము మీరి సంగ్రహించకుండుట) అనేవి సాధించమని

"యావనర్థ ఉదపానే సర్వతః సంప్లుతోదకే"

(అంతటా పరిపూర్ణ జాలాశయము ప్రాప్తిస్తుండగా చిన్న జాలాశయ ప్రయోజనాన్ని ఆశించకుండుట) ఇత్యాది నియమముల ద్వారా సమసమాజ నిర్మాణమును సాధించవచ్చుని గీత బోధిస్తుంది.

భగవద్గీత ఒక హిందూ మతమునకు చెందిన శాస్త్ర గ్రంథమే కాదు. తత్వశాస్త్రబోధతో మేళవించిన సామాజిక సిద్ధాంత గ్రంథము. పౌరులు ఆనందముగా తమతమ కర్మాచరణ చేయగల ఒక సామాజిక జీవనము, సంస్కృతిని దర్శింపచేస్తుంది గీత. మానవ జీవనమునకు, న్యాయ ఆర్థిక వ్యవస్థకు ఒక ఆధ్యాత్మిక మరియు సాంస్కృతిక పునాది గీత.

భారతీయ సంస్కృతికి వేదాంత ఆలోచనా సరళియే

మూలము. గీతలో బోధించిన జీవనశైలి సమాజ మరియు రాష్ట్ర ప్రగతికి అనుకూలముగా ఉంటుంది. మానవుని జీవితములో కష్టసుఖాలు అనివార్యము. కష్టములను సుఖముగా అనుభవించుటకు గీత మార్గదర్శకము అవుతుంది. భగవద్గీత సకల జీవన సంజీవిని. మృత్యురూప సంసారనివృత్తికి సోపానము.

"నిరామయం కృష్ణరసాయనం (భగవద్గీత) పిబ".

అన్నట్లుగా సకల జనులకు క్షేమాన్ని ప్రసాదించే భగవద్గీతను (కృష్ణరసాయనము) ఆస్వాదించ అనుసరించ వలెను.

భగవద్గీత ఆవిష్కరణకు పూర్వరంగము యుద్ధారంభమున అర్జునునికి కల్గిన విషాదము దు:ఖము. సంసారమునందు ప్రతీ ప్రాణి సుఖ దు:ఖములను అనుభవించవలసియే ఉంటుంది. అనుభవిస్తూనే ఉన్నారు. దు:ఖానుభవమే తాత్విక చింతనకు బీజము కావాలి. ఇది అర్జునునిలాంటి ఏ కొందరిలోనో కలుగుతుంది. అర్జునుని మానసికస్థితి తత్వబోధచేత విషాదమునుండి వివేకము (జ్ఞానోదయము) నకు పురోగతి చెందినది. అర్జునునికి యుద్ధరంగమున స్వధర్మాచరణకై శ్రీకృష్ణుడిచే అనుగ్రహించబడిన ఉపదేశము మానవులందరికీ వర్తిస్తుంది.

ఇది సకల మానవజాతి ఉన్నతికి మార్గదర్శకము. సర్వమతసహనమును, సామరస్యమును, శాంతియుతమైన లౌకిక జీవన విధానమును బోధించే నైతిక గ్రంథము భగవద్గీత.

"యోయో యాంయాం తనుం భక్తః శ్రద్ధయార్చితుమిచ్ఛతి।
తస్య తస్యాచలాం శ్రద్ధాం తామేవ విదధామ్యహం॥".

మానవుడు ఏ దేవతను ఆరాధించినా, వారికి కావల్సిన శ్రద్ధ, ఫలితమును నేనే ఇస్తాను అన్నాడు శ్రీకృష్ణుడు.

"యత్ర యోగేశ్వరః కృష్ణో యత్ర పార్థో ధనుర్ధరః।
తత్ర శ్రీర్విజయో భూతిః ధ్రువా నీతిర్మతిర్మమ॥"


కృష్ణార్జునసంవాద రూపమైన భగవద్గీత ఎక్కడైతే ఆచరించబడునో, అక్కడ సంపదలు, విజయము, ఐశ్వర్యము, నిశ్చయాత్మకమై ఉండును.

ప్రపంచములో దాదాపుగా అన్ని భాషలలోకి అనువదించబడి అత్యంతలోకప్రియత్వమును పొందిన ఏకైక గ్రంథము భగవద్గీత. (సశేషం)

## పుస్తక పరిచయం

# స్తోత్రరత్నం

శ్రీ వైష్ణవ సంప్రదాయంలో మకుటాయమానమైన పూర్వాచార్యకృత స్తోత్రం స్తోత్ర రత్నం. ఈ స్తోత్రంలోని ప్రతి శ్లోకము రత్నము వంటిదే! ఆచార్యుల చరిత్రను, సిద్ధాంత ప్రాచుర్యమును ప్రభావిత పరిచిన శ్లోకాలు ఇందులో




ఉన్నాయి. అందుకే యామునాచార్యులు రచించిన ఈ ఆళవందార్ స్తోత్రానికి స్తోత్ర రత్నం అని పేరు. ఇందులోని శ్లోకాలకు పెరియ వాచ్చాన్ పిళ్ళై ఆచార్యులు రచించిన ద్రావిడ వ్యాఖ్యానానికి ఆంధ్రానువాదం ఈ "స్తోత్ర రత్నం" అను పుస్తకము. రచించిన వారు. శతాధిక సంప్రదాయ గ్రంథకర్త, అనేక వ్యాసమాలికలు వ్యాఖ్యాన అనువాద రచనల ద్వారా సంప్రదాయ జ్ఞాన విస్తరణ గావిస్తున్న పండిత రత్న ఉ వే శ్రీమాన్ డా. ఈ. ఏ. శింగరాచార్యులు. 342 పేజీలు గల ఈ పుస్తకంలో ప్రారంభంలో ప్రచురణకర్తల ముందు మాట, ఆళవందారు స్తోత్ర నేపథ్య చరిత్ర మరియు స్తోత్ర వైభవం వివరించబడింది. 40 పేజీల విస్తారమైన వివరణ తర్వాత ఒక్కొక్క శ్లోకము, ద్రావిడ వ్యాఖ్యానము సంబంధిత ఆంధ్రానువాదం తాత్పర్యంగా వివరించబడింది. కీ.శే.ఉ వే శ్రీమాన్ ఓలేటి కోదండ రామానుజాచార్యులు గారి పవిత్ర స్మృతి పుష్పముగా కుటుంబ సభ్యుల ద్వారా గ్రంథం ముద్రించబడింది. ఆకర్షణీయమైన ముఖచిత్రంతో ఉన్న ఈ పుస్తకం విషయాసక్తి గలవారికి, స్తోత్ర ప్రవాచకులకు, సంప్రదాయ అనురక్తులకు ఉపయోగకరంగా ఉంటుంది. ప్రతులకు సంప్రదించాల్సిన ఫోన్ నెంబర్ 9959600015

# సంపదలు, సౌభాగ్యాన్నిచ్చే శ్రావణ మాసం

ప్రత్యేకం



**శ్రీమాన్ శ్రీ కె.ఇ.స్థలశాయి,** స్థానాచార్యులు
శ్రీసీతారామచంద్ర స్వామి వారి దేవస్థానం భద్రాచలం

కర్మ జ్ఞాన భక్త్యాది సాధనముల ద్వారా మహావిష్ణువును లక్ష్మీదేవిని పూజించుటకు తగిన మాసం శ్రావణ మాసం. ఈ మాసమే మహావిష్ణు దేవతాకముగా కీర్తించబడుతున్నది. వేదముల ననుసరించి, మహావిష్ణువు యొక్క ఆవిర్భావం శ్రవణా నక్షత్రం రోజున జరిగినది అని తెలుస్తున్నది. "శృణ్వంతి శ్రోణామమృతస్య గోపాం పుణ్యామస్యా ఉపశృణోమి వాచం" అంటూ "శ్రోణానక్షత్రం విష్ణుర్దేవతా" అంటూ వేదం కీర్తిస్తునది. శ్రవణానక్షత్రం విష్ణుర్దేవతాకమైన నక్షత్రము అని ఆ వేద మంత్రముల ద్వారా మనకు తెలుస్తున్నది. అట్టి శ్రవణా నక్షత్రం పూర్ణిమనాడు కలిగిన మాసము శ్రావణమాసము. విష్ణు సంబంధమైన శ్రావణమాస మంతటికి విష్ణువు అధిదేవత గనుక ఈ మాసంలో మహా విష్ణువును పూజించుట చాలా శ్రేష్ఠం. లోకంలో ఈ మాసం లక్ష్మీదేవి పూజ చేయటం కూడా ప్రసిద్ధిగా ఉంది. శ్రావణ శుక్రవారాల్లో లక్ష్మీదేవిని పూజించే ఆచారం, అలాగే శ్రావణ మంగళ వారాల్లోనూ లక్ష్మీదేవిని ఆరాధించటం, ముఖ్యంగా గోవును ఆరాధించే విధానం ధర్మ శాస్త్రములలో కనిపిస్తున్నది.

ఈ శ్రావణ మాసంలో ప్రధానంగా ఉపనీతులైన బ్రాహ్మణులు, నూతనంగా ఉపనీతులైన బ్రహ్మచారులు ప్రత్యేకించి ఆచరించేది శ్రావణ పూర్ణిమ. అనగా ఉపాకర్మ అనేది చేయటం ఆచారంగా ఉన్నది. శ్రావణ ఉపాకర్మ అంటారు. "ఆపస్తంభ" శాఖకు చెందినవారు, మరికొన్ని వేదశాఖలకు చెందిన వారు ఈ శ్రావణ పూర్ణిమ నాడు యజ్ఞోపవీతాన్ని మార్చుకొని నూతన యజ్ఞోపవీతం ధరించి ఉపాకర్మ చేయటం ఆచారం.

పూర్ణిమ నాడు ఈ ఉపాకర్మ చేసేటప్పుడు ప్రధానంగా యజ్ఞోపవీతం మార్చుకొని దేవర్షి పితృతర్పణాన్ని చేసుకొని అధ్యయన హోమం అనేది చేస్తారు. మర్నాడు గాయత్రీ హోమం చేయటం కూడా సంప్రదాయంలో ఉంది. ఈ విధంగా ఉపాకర్మను శ్రావణ పూర్ణిమ నాడు చేయటం వల్ల దీనికి జంధ్యాల పూర్ణిమ అనికూడా లోకంలో ప్రసిద్ధం.

చరిత్ర ననుసరించి రాఖీకట్టు కోవటం ఆచారంగా ఉంది. కనుక ఈ రోజును రాఖీ పూర్ణిమ అని కూడా అంటారు. అక్క చెల్లెళ్ళు అన్నతమ్ములకు రాఖీ కట్టడం వారిని ఆశీర్వదించటం అనే ఆచారం ఈ దేశంలో కన్పిస్తున్నది. శ్రావణ పూర్ణిమ నాడు ఈ పండుగలు చేసుకోవటం ఆచారంలో ఉంది.

> శ్రీకృష్ణుడి యొక్క అవతారం లోకానికి గొప్ప వెలుగును ప్రసాదించింది.
> శ్రీకృష్ణ పరమాత్మగా భగవంతుడు అవతరించి తన యొక్క అసాధారణ లీలల ద్వారా లోకంలో ధర్మ సంస్థాపనాన్ని చేసిన అవతారం శ్రీకృష్ణావతారం.


పూర్ణిమకు ముందుండే శుక్ర వారాలు, మాసంలో రెండవ శుక్ర వారం "వరలక్ష్మీ వ్రతం" చేయటం ఆచారంగా ఉంది.

చారుమతి అనే ఒక పుణ్య స్త్రీ ఈ వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరించటం వలన అపరిమితమైన సంపదలు, సౌభాగ్యాన్ని పొందింది అని పురాణాలు చెబుతున్నాయి. అందుకనే ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో స్త్రీలు వరలక్ష్మీ వ్రత మాచరించి తమ సౌభాగ్యాన్ని కాపాడుమని అమ్మవారిని ప్రార్థిస్తారు. అటువంటి గొప్పమాసం శ్రావణ మాసం. ఈ మాసంలో ప్రతి శుక్రవారమూ పవిత్రమైనదే. ఒక్కొక్కప్పుడు మాసంలో '5' వారాలు కూడా వస్తాయి. ప్రతి శుక్రవారం లక్ష్మీ పూజ చేస్తూ అమ్మవారిని ఆరాధిస్తుంటారు.

## సంపదలు, సౌభాగ్యాన్నిచ్చే శ్రావణ మాసం

ఒక్కో సందర్భంలో తమిళమాసంతో కూడిన 'ఆడి' మాసం శ్రావణ మాసం వచ్చినప్పుడు ఆ 'ఆడి' మాసం పుబ్బా నక్షత్రం ఆండాళమ్మ వారు అవతరించిన రోజు. దీనికి "తిరువాడిప్పూరం" అనే పేరుంది. ఇది ఆండాళమ్మ వారి తిరునక్షత్రం. సౌరమానం కర్కాటక సంక్రమణం పూర్వ ఫల్గుణి నక్షత్రం నాడు ఆండాళమ్మ వారి అవతార ఉత్సవాన్ని నిర్వహిస్తారు. ఈ ఆగస్ట్ 7 వతేదీ నాడు "తిరువాడిప్పూరం'" ఉత్సవం నిర్వహింపబడుతుంది. ప్రతి వైష్ణవాలయంలోనూ గృహాలలోనూ ఆండాళమ్మ వారి తిర్నక్షత్రాన్ని కర్కాటక సంక్రమణం పూర్వ ఫల్గుణి నక్షత్రం నాడు జరుపటం అనేది సంప్రదాయం.

శ్రావణ మాసం (బహుళ) కృష్ణ పక్షంలో "శ్రావణ బహుళాష్టమి" శ్రీకృష్ణుడు అవతరించిన రోజు. ఈ కృష్ణాష్టమి పర్వదినాన్ని దేశ వ్యాప్తంగా కృష్ణభక్తులు ఆచరిస్తారు. వైష్ణవ సాంప్రదాయాన్ననుసరించి సింహరాశిలో సూర్యుడు ఉన్నప్పుడు వచ్చే బహుళాష్టమి, రోహిణి నక్షత్రం నాడు శ్రీకృష్ణాష్టమి చేయడం ఆచారం.



ఈ సంవత్సరం అటు శ్రావణ మాసం, ఇటు సింహమాసం కలిసి వచ్చినందువల్ల సింహ మాసంగా వైష్ణవ సంప్రదాయంగా చెప్పే కృష్ణాష్టమి, గోకులాష్టమిగా చెప్పే శ్రావణ బహుళాష్టమి రెండూ ఒకరోజు వ్యత్యాసంతో వస్తున్నాయి. ఆగస్ట్ 26వ తేదీన గోకులాష్టమి (స్మార్త కృష్ణాష్టమి), 27 వ తేదీన వైష్ణవ శ్రీకృష్ణాష్టమి జరుపు కోవటం' జరుగు తుంది.

శ్రీకృష్ణుడి యొక్క అవతారం లోకానికి గొప్ప వెలుగును ప్రసాదించింది. శ్రీకృష్ణ పరమాత్మగా భగవంతుడవతరించి తన యొక్క అసాధారణ లీలల ద్వారా లోకంలో ధర్మ సంస్థాపనాన్ని చేసిన అవతారం శ్రీకృష్ణావతారం. అంతేగాక భగవద్గీత ఉపదేశం ద్వారా శ్రీకృష్ణుడు జగద్గురువుగా లోకంలో ప్రకటితం అయ్యాడు. అర్జునునికి కర్తవ్య బోధ చేసే విధానంతో భగవద్గీత ఆవిర్భవించింది.

పార్థోవత్సః సుధీర్భోక్త దుగ్ధం గీతామృతం మహత్।
సర్వోపనిషదో గావః దోగ్ధా గోపాలనన్దనః॥

ఉపనిషత్తుల సారమే భగవద్గీత. ఉపనిషత్తులన్నీ కూడా ఆవులయితే, ఉపనిషత్తులనే ఆవులను పితికే గోపాలకుడు శ్రీకృష్ణుడయితే, ఆ పాలను స్వీకరించే వత్సము ఆవుదూడ అర్జునుడయితే దూడను కొంతసేపటిపాటు పాలను తాగనిచ్చిన తరువాత మిగతావారికోసం పాలను పితికి గోపాలకులు ఇతరులకిస్తారు. అలాగ కృష్ణ పరమాత్మ ముందుగా అర్జునునికి ఉపనిషత్ సారాంశాన్ని ఉపదేశించి ఆ తరువాత వేదాంతులైన వారికి గీతామృతంగా ఆ పాలను పంచాడు. గోపాలకులెలాగయితే పాలను అందరికీ వితరణ చేస్తారో అలా శ్రీకృష్ణ పరమాత్మ ఉపనిషత్ సారాన్ని భగవద్గీతగా అందరికి పంచి పెట్టాడు. అలా భగవద్గీతను శ్రీకృష్ణ పరమాత్మ ప్రసాదించాడు. అందువలన జగద్గురువుగా ప్రసిద్ధుడు అయ్యాడు.

శ్రీక్రష్ణ పరమాత్మ అవతరించిన రోజు శ్రావణ బహుళ అష్టమి ఆగస్టు 26 వ తేది స్మార్త సంప్రదాయస్థులకు, 27వ తేది నాడు వైష్ణవ సాంప్రదాయస్థులకు ఏర్పడు తున్నది. కనుక కృష్ణాష్టమి నాడు జగద్గురువైన శ్రీకృష్ణుని యొక్క ఆరాధనను చేసి తద్వారా కృష్ణపరమాత్మ అనుగ్రహంతో అనేక శ్రేయస్సులను పొందుదాం!. ఈమాసం మొత్తం వచ్చే పవిత్రమైన రోజులలో చేయ వలసిన అనుష్ఠానములు చేసుకొని భగవంతుని యొక్క పరిపూర్ణమైన అనుగ్రహానికి పాత్రులమవుదాం!.

# ఘంటాకర్ణుడు

## తిరుక్కోళూర్ పెణ్ పిళ్ళై రహస్యాలు

**తిరుక్కోళూర్ పెణ్ పిళ్ళై పలికిన 81 వాక్యరత్నములలోని 6వ భక్తుడైన ఘంటాకర్ణుని గూర్చి పెణ్ పిళ్ళై గారు క్రింది విధముగా తెలుపు తున్నారు.**

ఘంటాకర్ణుని (పరసమృద్ధి). పరమాత్మను నవవిధాలైన భక్తిమార్గాల ద్వారా పొందగలమని మన పూర్వులు అనుగ్రహించారు.

"పిణ విరుందు యిట్టేనో ఘంటా కర్ణనైపోలే"

తాను భుజించు ఆహారాన్ని శ్రీకృష్ణునికి అర్పించిన మహానుభావుడు ఘంటాకర్ణుడు. అంతటి పరమభక్తి కలిగి ఉండి, నేను భుజించు ఆహారము శ్రీకృష్ణునికి ఎన్నడూ సమర్పించలేదు. అంటూ వాపోయింది పెణ్ పిళ్ళై గారు.

నాలుగు యుగాలలో ఒకటైన ద్వాపర యుగంలో జన్మించాడు. ఇతను ఘంటాకర్ణుడు. ఆతని తలితండ్రులు కూడా ధర్మ బద్ధమైన జీవితం గడిపేవారు. దయ, కరుణ గలవారు. "హూహూ" అనే గంధర్వుడైన వాడు, తన గానంతో దేవతల ప్రశంసలు పొందినవాడు ఘంటాకర్ణుడు. గొప్ప సాధకుడు, సనాతన ధర్మం ఆచరించేవాడు. శాపవశం చేత, హూహూనే ఘంటాకర్ణుడిగా తిరిగి జన్మిస్తాడు.

ఒక రోజు నదిలో స్నానం చేస్తూ తపస్సు చేసుకునే ముని పాదం పట్టి లాగి ఆతని శాపానికి గురవుతాడు. విష్ణువు ద్వారా విముక్తి కలుగుతుందని వరమిస్తాడు ముని. కానీ, శివుని తప్ప ఎవ్వరి నామం చెవులలో వినపడ కూడదని, విష్ణు నామం విననని, చెవులకు ఎల్లప్పుడూ గంటలు ధరిస్తాడు. గొప్ప శివ ఉపాసకుడు గాన కాశీకి వెళ్ళి అపార సాధన చేసి, ఘోరమైన తపస్సును ఆచరించగా, తపమునకు మెచ్చి శివుడు ప్రత్యక్ష మయ్యెను.

ఏమి కావాలనగా, నశించని మోక్షం ప్రసాదించమని కోరుతాడు. 'మోక్ష మిచ్ఛేత్ జనార్ధనః' అంటాడు శివుడు. అది శాస్త్ర ధర్మం అంటాడు. లోకసౌఖ్యాలు యిస్తానని చెప్పగా, వద్దని కుబేరుని ఆశ్రయించి అష్టాక్షరి మహా మంత్రం పొందిన వాడు ఈతడు. ఈమంత్ర జపం వలన నీ కోరిక సిద్ధిస్తుంది అంటాడు కుబేరుడు. తన శాపం విష్ణువు వల్లనే విమోచనం అవుతుందని తాను పూర్వ జన్మలో గంధర్వుడనని కూడా తెలుసు అతనికి. వెంటనే బదరీనాథ్‌కు వెళ్ళి అష్టాక్షరీ మంత్ర జపం చేసి, తన తపశ్శక్తితో స్వామిని ప్రత్యక్షం చేసుకుంటాడు ఘంటాకర్ణుడు.



**శ్రీమతి మహాలక్ష్మీ రాణి గుండు, రాజమండ్రి.**

బద్రీనాధునికి నివేదించిన ప్రసాదం ముందుగా ఘంటా కర్ణునికి సమర్పిస్తారు అక్కడ బద్రినాథ్‌లో. అంతటి పరమ భక్తుడు. బదరి దేవాలయంలో యిప్పటికి దర్శన మిస్తాడు ఘంటా కర్ణుడు. అక్కడే పాండుకేశ్వరం, మానా మొదలైన గ్రామాలలో అతనికి ఆలయాలు కట్టి పూజిస్తుంటారు. కుబేరుని వద్ద నుండి మంత్రం పొందిన సమయంలో శ్రీమన్నారాయణుడు యిపుడు శ్రీకృష్ణునిగా భూలోకంలో ద్వారకలో అవతరించి ఉన్నాడని, ఆతని వద్దకు వెళ్లి నీకోరిక చెప్పిన సిద్ధించ గలదని కుబేరుడు చెప్పగా, అలాగేనని ద్వారకకు బయలు దేరెను. పెరుమాళ్లకు ఉపహారం ఏదైనా సమర్పించాలని తలచి, దారిలో కనపడ్డ ఒక పీనుగను ఎత్తుకెళుతుండగా, శ్రీకృష్ణుడే ఎదురుగా రాగా, ఏమి నా భాగ్యం అనుకొని సంతోషంతో ఆ పీనుగను ఆరగించమని ప్రార్ధించగా, స్వామి స్వీకరించారు. అంతట వాడు స్వామిని నాకు నిత్యమైన మోక్షం ప్రసాదించు అంటాడు. తథాస్తు అంటారు స్వామి. ఘంటాకర్ణుని వలె తాను భుజించు ఆహారం నేనేమైనా శ్రీకృష్ణునికి సమర్పించు కోలేదు కదా, ఆతనికికల పరమ భక్తి నాకు లేదు కదా అని (మనం భుజించు పదార్థములు భగవంతునికి నైవేద్యం, ఆరగింపు చేయవచ్చునా అయితే, ఆ తిను పదార్థములు శాస్త్ర సమ్మతము అవునా అని చూడవలెను) అని మనకు తెలియచేస్తున్నారు. ★

# భావ గర్భితం స్తోత్రరత్నం



శ్రీమాన్ శ్రీ డా.వోలేటి రవికుమారాచార్యులు

గతసంచికలో భగవత్ యామునాచార్య స్వామి వారి తనియన్ అర్థ విశేషాలను యథాశక్తి ఆచార్య కటాక్షముతో అనుభవించాము. అయితే, భగవద్రామానుజులు అంతటి వారు యామునుల పాదపద్మ స్మరణచేత పాపములు తొలగిపోయి నేను ఒక ఉనికి కల వాడినయ్యాను అని అన్నారంటే అసలు యామునాచార్య స్వామి వారు రామానుజులకు ఏమి బోధించి ఉంటారు? రామానుజులు యామునుల విషయంలో ఎటువంటి శుశ్రూష (సేవ) చేసి ఉంటారు? అనే ఒక ఆసక్తి కలుగుతుంది. కానీ, భగవత్ రామానుజుల చరిత్రను అధ్యయనం చేసినపుడు ఎక్కడ కూడా మనకు రామానుజులు శ్రీమత్ యామునుల దగ్గర నేరుగా విద్య నేర్చుకున్నట్లు కనపడదు. ఏ సందర్భములో మొట్టమొదటి సారిగా భగవద్రామానుజులు యామునాచార్య స్వామి వారి వైభవాన్ని తెలుసుకున్నారు అనే విషయాన్ని పరిశీలిద్దాము.

భగవద్రామానుజులు విద్యార్థి దశలో ఉన్నపుడే ఆచార్య స్థానంలో ఉన్న తండ్రిని కోల్పోయాడు. అటుపై యాదవప్రకాశులనే గురువు పన్నిన హత్యాయత్నమునుండి ఆ వరదరాజస్వామి దంపతులచే (కాంచీపురం) బైటపడి ఏ గురువు లేక కాంచీపూర్ణులను నిర్బంధించి అయినా గురువుగా పొందుదాము అనుకున్నాడు. పరమభక్తులైన కాంచీపూర్ణుల వారు అసలే ఒప్పుకోలేదు. ఏమి చేయాలో అర్థంకాని దశలో కాంచీపురంలో వరదరాజ స్వామి సన్నిధిలో తీర్థ కైంకర్యము చేస్తూ వరదుని అనుగ్రహము కొరకు ఎదురుచూస్తున్న రోజులవి.

శ్రీరంగములో సంప్రదాయ ప్రవర్తకులై సిద్ధాంత పీఠాన్ని అలంకరించిన యామునాచార్యుల వారు వృద్ధులై అనారోగ్యముతో బాధపడుతున్న సమయములో రామానుజులు ఏ ఆచార్యుని వద్ద ప్రస్తుతము శిష్యరికం చేయుటలేదు అని విని, త్వరగా రామానుజుల్ని తనవద్దకు తీసుకురావాలని తన ప్రియశిష్యులలో ఒకరైన మహాపూర్ణులను ఆదేశిస్తారు యామునులు. (మహాపూర్ణులకే పెరియనంబి అని ద్రావిడములో నామధేయము). అపుడు హుటాహుటిన బయలుదేరిన పెరియనంబి కాంచీపురంలో తీర్థ కైంకర్యము చేస్తున్న రామానుజులకు వినపడేట్లు తమ ఆచార్యులైన యామునుల స్తోత్రములోని ఒక శ్లోకమును పఠిస్తారు.

"స్వాభావికానవధికాతిశయేశితృత్వం
నారాయణ ! త్వయి న మృష్యతి వైదికః కః।
బ్రహ్మా శివః శతమఖః పరమస్స్వరాట్ ఇతి
ఏతేపి యస్య మహిమార్ణవ విప్రుషస్తే॥".

మన సంప్రదాయములో మూడు రత్నములు కలవని పెద్దలు చెప్తారు. అవేమంటే ద్వయమంత్రము, శ్రీవిష్ణుపురాణము మరియు ఆళవందార్ స్తోత్రము. వీటికే వరుసగా మంత్రరత్నము, పురాణరత్నము మరియు స్తోత్రరత్నము అని వ్యవహారము. ఇట్టి మహిమాన్వితమైన స్తోత్రరత్నములోని పదకొండవ శ్లోకమును ఆలకించిన రామానుజులు సంభ్రమాశ్చర్యాలకు గురి అవుతారు.

"ఆహా ఏమిటీ అద్భుతమైన భావగర్భితమైన శ్లోకము శ్రీమన్నారాయణుని యొక్క పరత్వాన్ని గ్రహించనివాడు వైదికుడు ఎట్లగును? చతుర్ముఖ బ్రహ్మ, శివుడు, ఇంద్రుడు అనే ప్రసిద్ధమయిన దేవతలయొక్క మహిమ సర్వేశ్వరుడైన శ్రీమన్నారాయణుని మహిమ అనే సముద్రములో ఒక బిందువు మాత్రమే" అని వేద వేదాంతాల సారమయిన ఇట్టి శ్లోకమును అనుగ్రహించినది ఎవరు అని వినయ పూర్వకముగా దాసోహం సమర్పించి మహాపూర్ణులను అడిగి తద్వారా యామునుల వైభవాన్ని తెలుసుకుంటారు.

అదిగో అది విన్నప్పటి నుండి భగవత్ యామునులపై అచంచల భక్తి విశ్వాసాలు కలిగి తర్వాతి కాలంలో యామునాచార్యుల గ్రంథాలను (మిగతా 30 వ పేజీలో)

# జ్యోతిర్విజ్ఞానమ్

## శ్రీమాన్ శ్రీ నంబి వేణు గోపాలాచార్య కౌశిక



అలంకారం గురించి చెప్పేది ప్రకృతి. అలంకారంలో వుండేటి అంశాలు మూడు. అలంకారంతో ఉండేది ఆరోగ్యం, ఆనందం, ఆహ్లాదం. ఈ మూడుగూడా అప్పుడప్పుడు గమనిస్తూవుంటే ఒక్కొక్క లోకంలో భగవంతుడు ఒక్కొక్క అలంకారంతో ఆనందాన్ని పెంచి పంచుతూ వున్నాడు అందరికి పరమాత్మ. అట్లాగే భూలోక, భువర్లోక, సువర్లోక, మహర్లోక, జనోలోక, తపోలోక, సత్యలోకాది లోకాలను, అతల, వితల, సుతల, రసాతల, పాతాళాది లోకాల్ని ఒకసారి గణిస్తే, ఒక్కొక్క లోకంలో ఒక్కొక్క రకమైనటువంటి అలంకారాలు, ఆహ్లాదాలు, ఆరోగ్యాలు, ఆయుప్రమాణాలు వివిధంగా పురాణాల ద్వారా మనకు తెలుస్తూ వున్నాయి.


అట్లాగే మనం భూలోకానికి వస్తే ఇక్కడ వుండే అందమైన పర్వతాల ద్వారా అందులో శిలా పర్వతాలు, మృత్తికా పర్వతాలు, మంచు పర్వతాలు, ఓషధులతో నిండిన పర్వతాలు వాటిపై వుండే అందమైన వృక్షాలు, వాటికింద వుండే వాల్మీకాలు, అక్కడ తిరిగే అందమైన సర్పాలు, చెట్లపైన వుండే పక్షులు, పక్షుల కిలకిలా రావాలు. అందమైన శరీర రూపాలు రంగులు రంగులుగా ప్రకాశించే అద్భుతమైన దృశ్యాల ద్వారా మనుష్యులు ఆనందిస్తూ వుంటారు. ఆహ్లాదాన్ని పొందుతూ వుంటారు. అదే విధముగా పల్లాలుగా వుండే ప్రాంతాలలో ప్రవహించే జల రాశులు, కొండ వాగులు మంచి ఆనందాన్ని కలిగింప చేస్తాయి. ప్రపంచానికి అదొక రకమైన అలంకారంగా పరమాత్మ సృష్టిస్తే వాటిని చూసి వాటి ద్వారా మనము ఆనందాన్ని పొందుతూ వున్నాము.

అలంకారం అంటే ప్రాచీన కాలంలో అలంకారంగా పెయింటింగ్స్ వేసేవాళ్ళు ఈనాటి కెమికల్స్ రంగులు కాకుండా కేవలం సహజ సిద్ధంగా వుండే పుష్పరసాల చేత, ఫల రసాల చేత, ఆకుల రసాల చేత వాటితో బొమ్మలు రాయడం మూలకంగా చిత్ర రచన చేసేవారు. అందులో మూడు ప్రయోజనాలు ఒకటి కంటికి ఆనందం, రెండు శరీరానికి ఆరోగ్యము, మూడవదైన ఆహ్లాదాన్ని కలిగింప చేసే దృశ్యాలు చిత్రీకరణ చేసే వాళ్ళు. ఈ అలంకారాలు అన్ని ప్రకృతినుంచే సంప్రాప్తమయ్యాయి. ఎలా సంప్రాప్తమౌతాయి అని ప్రశ్నిస్తే. ప్రకృతిలో జీవించిన మహనీయులు, మహాపురుషులు అరణ్యాలలో వుండి దివ్యమైన వృక్షాల ద్వారా, మూలికల ద్వారా, ఓషధుల ద్వారా వాటిలో వుండే గొప్పతనాన్ని వారి వారి పరంపరలో వుండే ఆచార్యుల ద్వారా తెలుసుకొన్నారు తద్వారా ఆరోగ్యాన్ని ఎలా పొందవచ్చు, ఆనందాన్ని ఎలా పొందవచ్చు, ఆహ్లాదాన్ని ఎలా పొందవచ్చో కూడ తెలుసుకొన్నారు. అట్టి వారి పరంపరలో వాళ్ళు వ్రాసిన గ్రంథాల ద్వారా ప్రకృతి ద్వారానే విజ్ఞానం అందుతుందని మనము తెలుసుకోవచ్చు. ప్రకృతిలో వుండి జీవించి ప్రాచీనులందరు కూడా ప్రకృతి పరిరక్షణ, సంరక్షణ చేస్తూ అందులో వీరు కూడా ఒక భాగమై జీవించారు.

భూమి సమతుల్యంగా ఉండాలి అంటే దానిమీద వుండే వాతావరణం సక్రమంగా సాగాలంటే, పారే సెలయేళ్ళు నిర్భయంగా ప్రవహించ గలగాలి. అందమైన కొండలు వాటి వాటి స్థానాల్లో ప్రకృతి సిద్ధంగా ఏర్పడిన ప్రాంతాలలోనే వుండి ఉండాలి. అరణ్యాలలో వుండే వృక్షాలన్ని కూడా ప్రకాశిస్తూ వృక్షముల యొక్క గుంపులు అనగా రకరకాలైన ఓషధుల సమ్మేళనంతో కలిగిన చెట్లు, అక్కడ నుండి వచ్చే గాలి ద్వారా, వారినుంచి వచ్చే వాసన శక్తి ద్వారా ప్రాణులన్నీ కూడా పరిపూర్ణమైన ఆయురారోగ్యలతో అనాదిగా వర్ధిల్లాయని మనకు శాస్త్రాలు చెపుతున్నాయి. అందుకే వృక్షాల్ని రక్షించడం, నదులని రక్షించడము, పర్వతాల్ని రక్షించడము, మట్టిని రక్షించడము, అగ్ని హోత్రాన్ని రక్షించడము అనేది శ్రీమద్భాగవతం తెలుపుతుంది. అందుకే శ్రీకృష్ణ పరమాత్మ మన్ను తిన్నాడు అంటే భూమిని శుద్ధి చేసాడు. కరస్పర్శ తాకినంతనే పవిత్రమైంది. అలాగే జలాల్ని శుద్ధి చేసాడు. ఈనాడు నీటిని, మట్టిని కూడా కలుషితం చేస్తున్నారు. మట్టిలో వుండే (మిగతా 26 వ పేజీలో)

# భగవంతునిపైన భారము

విభీషణుడు ఎప్పుడు రావణుడు తనను దూషించి వెళ్ళ గొట్టాడో, ఇంక అక్కడ వున్న ప్రయోజనము వుండదు. రావణుడి దౌష్ట్యాన్ని చూస్తూ సహిస్తూ వుండడము తప్పని అనుకొని అక్కడనుండి బయలుదేరాడు. అన్యదేవతలను శరణజొచ్చడమో, అన్యమార్గాలను అన్వేషించడమో చేయలేదు. అతనికి విశ్వాసము ఎవరివద్ద? పరమాత్మ వద్దే! నేరుగా రాములవారు వున్నచోటికి వెళ్ళాడు. రాములవారినే నేరుగా ఆశ్రయించాడా? లేదు. ఆకాశములోనే నిలచి వానర నాయకుడికి విన్నపము చేశాడు. ఇదే ముఖ్యమైన అనుకూలమైన విషయము. అందుకే ఎప్పుడు పరమాత్మ సన్నిధికి మనము నేరుగా వెళ్ళకూడదు. ఒంటరిగా వెళ్ళిసేవించుకొని రావడము తప్పు. మనము కోవెలకెళ్ళినా, అక్కడ భాగవతోత్తముడై, పరమాత్మకు సకల కైంకర్యములను సమర్పించే అర్చకస్వామి ద్వారానే పరమాత్మను సేవిస్తాము.



"నిస్సమాభ్యధిక మభ్యధత్త యం" కూరత్తాళ్వాన్ వరదరాజ స్తవములో చెప్పారు. నేరుగా మనము ఆయన వద్దకు వెళ్తే, మన దోషములను చూసి "క్షిపామి" అని మనలను శిక్షించవచ్చు. అదే ఆయనకు ప్రీతిపాత్రులైన భాగవతోత్తము లను ముందుంచుకొని వెళితే భక్తుని మిత్రుడని ఆదరిస్తాడు కటాక్షిస్తాడు. శరణాగతి అనుష్ఠించేటప్పుడు మనము నేరుగా పరమాత్మ వద్దకు వెళ్ళకూడదు. మనమందరము, సదాచార్యుల ద్వారా సంస్కరించబడి శరణాగతి చేస్తున్నాము.

అలాగే విభీషణుడు కూడా నేరుగా రాములవారిని చేరలేదు

"ఆజగామ ముహూర్తేన యత్రరామ సలక్ష్మణః"

రాముడు ఒక రాయి మీద, ఆకొండప్రాంతములో, ఆసీనుడై వున్నచోటుకు, లంకాపట్టణమునుండి ముహూర్త కాలములో చేరికూడా, నేరుగా వెళ్ళలేదు. అక్కడవున్న రామభక్తులైన, సుగ్రీవాదుల వద్ద రాములవారికి తెలియపరచండి అంటూ తన నైచ్యాన్ని తెలియబరచి శరణు వేడుతున్నానన్నాడు.

"నివేదయతు మాం క్షిప్రం, విభీషణ ముపస్థితం।

సర్వలోక శరణ్యాయ రాఘవాయ మహాత్మనే॥

'నివేదయత' విన్నపము చేయండి అని వీరిని ప్రార్థించాడు.



అలా అడియార్గళ్ దాసాను దాసులను ముందుంచు కొని శరణువేడుట, శరణాగతి శాస్త్రములోనే అతి ముఖ్య ఘట్టం. దానిని సంపూర్ణముగా యథా విధిగా పాటించిన విభీషణ శరణాగతి అతి సవ్యమైన శరణాగతి! ఆనుకూల్యస్య సంకల్పము దీనివల్ల ప్రస్ఫుట

**శ్రీమతి వంగల రాధిక**

మైతోంది.

ఇంక మూడవది 'ప్రాతికూల్యస్య వర్జనం' అంటే పరమాత్మకు ప్రీతికరమైనది చేయాలంటే, పరమాత్మకు ఏది ఇష్టములేదో దానిని వదిలేయాలి! అశాస్త్రీయ మైనది వదిలేయాలి. ఆత్మవేరు శరీరమువేరు అన్నది తెలియాలి. శరీరసంబంధ దోషాలైన భగవత్ప్రాప్తికి, విరోధాలైన వాటిని త్యజించాలి. భగవత్ విరోధాలను త్యజించపోతే ధర్మవర్తనం ఉన్నప్పటికి ఏవిధంగా పతనం అవుతారో తెలుసుకోవచ్చు.

ఇక్కడ మనము కర్ణుడికి విభీషణుడికి గల తేడాను గమనించవచ్చు. కర్ణుడు ధర్మకార్యములు చేయడములో ఆసక్తి అభిరుచి గలవాడే. దానము చేయడంలో కర్ణుడంతటి వాడు లేడని దానకర్ణుడనే ప్రసిద్ధి. మరి ఎందుకు అథోగతి పాలయ్యాడు. దుర్యోధనుని దుర్మార్గాలను, అధర్మ మార్గాలను నిరోధించలేదు. తప్పులు చేస్తున్న దుర్యోధనాదులను వీడి రాక, వారిచెంతనే వుండిపోయి వారికి ఋణపడి వున్నానంటూ ఆతప్పులకు తానూ బాసటగా నిలిచాడు.

అదే విభీషణుడు తన ధర్మబద్ధమైన మాటలను వినని తన స్వంత సోదరుడినే తత్ క్షణమే వదిలేసి "ముహూర్త కాలములో" పరమాత్మ చెంత చేరాడు. విభీషణుడి ధర్మబద్ధమైన మంచిమాటను విని విభీషణుని రావణ కుమారుడు ఇంద్రజిత్ భీరువని హేళన చేశాడు. రావణుడు

తన తమ్ముని అవమానకరమైన పదజాలముతో తన తనయుడు దూషించడాన్ని వినికూడా నివారించలేదు. సరికదా "కుల దిగ్భ్రంసనం" రాక్షసకులానికే తలవంపులు తెచ్చేవాడా "కులనాశకా" అని తిట్టి వెళ్ళగొట్టాడు.

" ఇత్యుక్త్వా పరుషం వాక్యం, రావణం రావణానుజః
ఆజగామ ముహూర్తేన యత్ర రామః సలక్ష్మణః" అంతే అలా పరుషవాక్యాలతో దూషింపబడిన మరుక్షణం, అక్కడ నిలువలేదు విభీషణుడు. ఆక్షణంలోనే తన రాజ్యాన్ని అన్నదమ్ములను, భార్యాపిల్లలను, తన సకలైశ్వర్యములను వదిలేశాడు. రామలక్ష్మణులు వున్నచోట వెళ్ళి వాలాడు.

అధర్మమున్న చోట క్షణమునిలిచినా అది మన ఉజ్జీవనానికి విరోధము అవుతుంది. ఎలా మనము నివసించే యింటికి నిప్పంటినచో అన్నీ వదిలేసి ధనము, కనకము, ఆహార ధాన్యములు, వస్త్రములు, బంధువులు అంటూ దేనినీ వెనక్కి తిరిగి కూడా చూడకుండా వదిలేసి ఇంటి బయటికి పరుగెడుతామో అలా ఎక్కడ అధర్మము రాజ్యమేలుతుందో అక్కడి నుంచి అన్నిటినీ త్యజించి తృటిలో బయటపడిపోవాలి. మన మనస్సు అతి చంచలమైనది. చెడు నిమిషములోనే దానిని వరించగలదు. అలాగే మంచిని తృటిలో వదిలేయనూ గలదు.

రామానుజుల వారు తిరుక్కచ్చినమ్బి ద్వారా కంచి వరదరాజ పెరుమాళ్ నుడివిన "ఆరువార్తైగళ్" సమాధానము విన్నారు. "గురువాగ యారై ఏర్పదు" అన్న రామానుజుల ప్రశ్నకు "పూర్ణాశ్రయ సమాశ్రితః" అని దేవరాజపెరుమాళ్ పెరియనమ్బి వద్ద సమాశ్రయణము పొందాలని చెప్పిన సమాధానమును తిరుకచ్చినమ్బిగళ్ వద్దనుంచి విని తక్షణమే కాంచీపురము నుంచి బయలుదేరారు. అటు పెరియనమ్బి కూడా రామానుజులను సేవించాలని శ్రీరంగము నుంచి కాంచీపురంవైపు పయనమయ్యారు. ఇద్దరూ మధురాంతకం రామర్ కోవెలలో కలుసుకొంటారు. అప్పుడు పెరియనమ్బి "రామానుజా కొంచెందూరం వెళ్తే నిన్ను ఆదేశించిన దేవరాజ పెరుమాళ్ సన్నిధి కాంచీపురానికే చేరిపోతామే. అక్కడే లేదా దివ్య దేశమైన శ్రీరంగములో సమాశ్రయణము చేసుకోవచ్చుకదా అంటారు. రామానుజులు ఒప్పుకోరు. "మిన్నుయిర్ ఆక్కైగళ్" దానికంటే ఈ "మంది పాయ్" కోతిబుద్ధి మనస్సును నమ్మలేము కనుక వెంటనే అక్కడికక్కడే అయిపోవాలన్నారు కదా! ★

# శ్రీరామానుజ సుధామాధురి

(7 వ పేజీ తరువాయి) కొందరు పూర్వపు బంధువులు రాగా వారు వెళ్ళిన తర్వాత ఇంటిని శుభ్రం చేసి ఆ పాత్రలన్నీ పడవేశారు. ఆచార్య భక్తి కైంకర్య పరులైన దాశరథి వద్ద గల పాత్రలను తెచ్చుకొని శుభ్రపరచి ఉపయోగించుకున్నారు. దేహ సంబంధం కంటే ఆచార్య సంబంధ పవిత్రతను ఇలా వారు తెలియజేశారు. ఇటువంటి వెన్నో ఆచార్యభక్తిని నిరూపించే సన్నివేశాలు చరిత్రలో కనిపిస్తాయి. అందుకే యతిరాజుల వైభవాన్ని ప్రకాశింప చేసిన వడుగనంబి చరిత్ర విశేషాలను "చిత్రగుప్తాధిభిస్తాని న గణ్యంతే మహాత్మాభిః" చిత్రగుప్తాదులగు మహాత్ములు కూడా లెక్కించలేరు. అని అంటారు.

రామానుజాచార్యులు దేవాలయ ఆరాధనలను ఆగమ బద్ధంగా సంస్కరిస్తూ దివ్యదేశాలు తిరుగుతూ తిరువనంతపురం నుండి తిరుక్కురుంగుడి ప్రాంతానికి వచ్చారు. భగవదాజ్ఞతో రాత్రికి రాత్రి వచ్చిన భగవద్ రామానుజులు ఉదయాన్నే వడుగనంబిని తిరుమణి కోసం పిలిచారు. కానీ ఆయన ఇంకా అక్కడికి చేరుకోలేదు. ఆచార్యులకు శిష్యునిపై ఉండే ప్రేమకు ముచ్చటపడి వడుగనంబి రూపంలో వెంటనే అక్కడికి భగవంతుడే వచ్చాడట! రామానుజులు తిరుమణి తీసుకుని ద్వాదశ ఊర్ధ్వపుండ్రాలు ధరించి మిగిలిన తిరుమణిని అలవాటుగా నంబి రూపంలో గల స్వామి ముఖం పైన దిద్దారు. ఈ విషయాన్ని దర్శనం తర్వాత తెలుసుకున్నారు రామానుజులు. నాటి నుండి ఇక్కడి పెరుమాళ్ళు "తిరుక్కురుంగుడి వైష్ణవ నంబి"గా ప్రసిద్ధిగాంచారు.

ఆంధ్రపూర్ణులు అంతిమంలో మిథిలా సాలగ్రామ నగరంలోనే ఒక బావి తవ్వించి అందులో గురువుల పాద తీర్థాన్ని ఉంచి, సమీపంలో కోవెల కట్టించి అందులో ఆచార్య పాదాలను ప్రతిష్ఠించి ప్రతి దినము శ్రీపాద తీర్థాన్ని సేవిస్తూ పాదుకలను అర్చిస్తూ గడిపారట!

ఆచార్యుడే పరత్వమనే సిద్ధాంతానికి ఆధారమైన ఆంధ్ర పూర్ణుల చరిత్ర వింటేనే "ఆచార్య భక్తః స భవేత్ మనుష్యః" విన్నవారు ఆచార్య భక్తులవుతారు అని పెద్దలు చెప్తారు. జీవన గతి గమ్యం గురువే సర్వం! అనే శిష్యాగ్రేసరులు గల గొప్ప మహిమ గలవారు జగదాచార్యులు. ★

# శ్రీరామాయణంలో ఉపకథలు

# గుహప్పెరుమాళ్





**శ్రీమతి చక్రవర్తుల చూడామణి, ఖమ్మం**

వేదవేద్యే పరే పుంసి జాతే దశరథాత్మజే।
వేదః ప్రాచేతసాదాసీత్ సాక్షాత్ రామయణాత్మనా॥
వైదేహీ సహితం సుర ద్రుమతలే హైమే మహా మండపే।
మధ్యే పుష్పక మాసనే మణిమయే వీరాసనే సుస్థితం॥

'మహతః మంద్రైస్సహ నీరంధ్రేణ సంశ్లేషః సౌశీల్యమ్' జాతి చేత, ఐశ్వర్యము చేత, విద్య చేత గొప్పవాడైనా, తక్కువ వాడైనా అతనితో కలసి ఉండటమే సౌశీల్యం. శ్రీరాముడు జన్మ చేత క్షత్రియుడు సూర్య వంశానికి చెందినవాడు. ఐశ్వర్యముచే చక్రవర్తి కుమారుడు. విద్యచే వశిష్ఠాదుల శిష్యుడు. అయినా 'నిషాదానాం నేతా కపికుల పతిః కాపీ శబరి' అని గుహుడిని, విభీషణుని, సుగ్రీవుడిని తన సోదరులతో సమానంగా ఆదరించాడు, ప్రేమించాడు, సన్మానించాడు.

గుహుడు నిషాదకులానికి చెందిన ఆటవికుడు మానవుడు. సుగ్రీవుడు వానర జాతికి చెందినవాడు, వానరం. విభీషణుడు రాక్షసుడు, శత్రువు యొక్క తమ్ముడు. అయినా అందరినీ శ్రీరాముడు లక్ష్మణ, భరత, శత్రుఘ్నుల కంటే తక్కువగా చూడలేదు. ఆ ముగ్గురిలో కూడా గుహుడిది ఉన్నత స్థానం. లోకాన్నంతా సంసార సాగరం దాటించే పరమాత్మను గంగానది దాటించిన పుణ్యమూర్తి. నిషాదుడైనా శ్రీరామచంద్రుడి కృపకు పాత్రుడవటం వలన శ్రీరామ భక్తులలో ఆయనకు ప్రత్యేక స్థానం ఉంది. ఆళ్వార్లు ఇంకో మెట్టు పైకి వెళ్ళి గుహుడిని 'గుహప్పెరుమాళ్' అన్నారు.

దేవతలందరూ కలిసి రావణుడి పీడ నుంచి కాపాడమని శ్రీమన్నారాయణుని శరణాగతి చేశారు. వాళ్ళ కోరికను మన్నించి శ్రీమన్నారాయణుడు ఈ లోకంలో ఇక్ష్వాకు వంశంలో దశరథ మహారాజు కుమారుడుగా శ్రీరాముడుగా అవతరించాడు. శ్రీరాముడి చరిత్రను వాల్మీకి ఇరవై నాలుగు వేల శ్లోకాలతో శ్రీ రామాయణాన్ని మనోరంజకంగా రాశారు. రామాయణంలో భగవంతుడి కళ్యాణ గుణాలను వాల్మీకి మహర్షి విస్తారంగా చెప్పడం జరిగింది. ఇతిహాసాలైన భారత రామాయణాలలో రామాయణం ఉన్నతమైనదిగా మన ఆచార్యుల చేత ఆదరించబడింది.

పితృవాక్య పరిపాలన కోసం రాముడు వనవాసానికి బయలు దేరాడు. అయోధ్య నుంచి బయలుదేరి గంగా తీరంలోని శృంగిభేర పురానికి చేరుకున్నారు. ఆ ప్రాంతాన్ని శ్రీరాముడికి భక్తుడు, మిత్రుడు అయిన నిషాదజాతికి చెందిన గుహుడు పరిపాలిస్తున్నాడు. అతడి ఉత్తమమైన పరిపాలనలో అక్కడి ప్రజలు ప్రశాంతంగా, సుఖంగా జీవిస్తున్నారు. గంగానది అతి స్వచ్ఛంగా ఉంది. నీళ్ళలో తిరిగే జలచరాలు, మొసళ్ళు, సర్పాలు కనపడేటంత తేటగా గంగానది ప్రవహిస్తోంది. విష్ణు పాదం నుంచి అవతరించడం వలన ఇది పరమ పవిత్రమైన నది.

మహాపురుషుడైన శ్రీరాముడు తమ దేశానికి వచ్చారన్న వార్త విని వృద్ధులు, తమ జాతిలో పెద్దలు, మంత్రులతో రాముడిని ఆహ్వానించడానికి గుహుడు వచ్చాడు. ఎదురేగి ఆయనను ఆహ్వానించి, రాముడితో 'మీకు ఈ రాజ్యం అయోధ్య లాంటిది. నేను మీకు సేవకుడిని. ఏం చేయాలో ఆజ్ఞాపించండి' అని వినయంగా చెప్పాడు. సీత, లక్ష్మణ సహితుడైన రాముడికి అర్ఘ్య పాద్యాదులు సమర్పించి అతిథి మర్యాదలు చేశాడు గుహుడు. ఆ తర్వాత భక్ష్యం భోజ్యం, పానకం మొదలైనవి తెప్పించి సమర్పించాడు. గుహుడిని ఆప్యాయంగా పలకరించి తన మిత్రుడుగా స్వీకరించాడు రాముడు.

అర్చితా శ్చైవ హృష్టాశ్చ భవతా సర్వథా వయమ్।
పద్భ్యా మాభిగమాచ్చైవ స్నేహ సందర్శనేన చ॥
(శ్రీరామాయణం. అయోధ్యకాండ 50.40 )

'మిత్రమా కాలినడకతో ఇంత దూరం వచ్చి, నీ స్నేహ సద్భావాలను ప్రకటించావు. ఇదే మాకు సకల సత్కారాలు.

# గుహప్పెరుమాళ్

చాలా సంతోషంగా ఉంది' అని రాముడు చెప్పాడు. తాను అయోధ్యకు పట్టాభిషిక్తుడు కావలసి ఉండగా, కైక కోరిక మేరకు రాజ్యాన్ని వదిలి, 14 సంవత్సరాలు వనవాసానికి బయలుదేరిన సందర్భం. అయినా దాని గురించి ఏ మాత్రం బాధపడకుండా అయోధ్య నుండి సరయూ నది దాటి గంగా తీరం దాకా వచ్చాడు. అదంతా ఆయనకు పెద్ద విషయంగా తోచలేదు. గుహుడు ఆ నాలుగడుగులు నడిచి రావడం చూసి 'అయ్యో! పాదాలతో నడచి వచ్చావా?' అని ప్రేమతో అడిగాడు రాముడు. ఇంకా గుహుడిని 'ఆత్మ సమః సఖా' అని (అయోధ్యకాండ 50-32 ) అన్నాడు.

ఆప్యాయంగా గుహుడిని కౌగలించుకుని 'నీవు నీ బంధువులు క్షేమమా' అని కుశల ప్రశ్నలు అడిగాడు. తరువాత వ్రత దీక్షలో ఉన్నందున ఆయన సమర్పించిన భోజన పదార్థాలు స్వీకరించలేనని సున్నితంగా తిరస్కరించాడు. సీతారాములు పవిత్ర గంగా నది నీటినే ఆహారంగా తీసుకున్నారు. గుహుడు వాళ్ల కోసం గడ్డితో శయ్యను ఏర్పాటు చేయించాడు. సీతారాములు శయనించినా, లక్ష్మణుడు నిద్రపోకుండా సీతారాములకు కావలి కాయడం చూసి, గుహుడు 'నువ్వు రాజకుమారుడివి నువ్వు కూడా విశ్రాంతి తీసుకో' అని చెప్పాడు. 'మా అన్నావదినలు ఇలా ఉండగా నాకు నిద్రహారాలు సహించవు. వనవాసం పూర్తిచేసుకుని మళ్లీ అయోధ్యకు వెళ్ళి రాముడికి పట్టాభిషేకం జరిగేదాకా నేను వాళ్ళ సేవలో ఉంటాను' అని ఎంతో ఆర్తితో చెప్పాడు లక్ష్మణుడు.

రాత్రి గడిచి తెల్లవారింది. రాముడు లక్ష్మణుని పిలిచి 'సుప్రభాతం అయింది. మనం ప్రయాణం సాగించాలి గంగను దాటడానికి ఏర్పాట్లు చేయమని చెప్పాడు. లక్ష్మణుడు గుహుడిని చూసి అన్నగారి మాటలను తెలియజేశాడు. వెంటనే గుహుడు తన మంత్రులను పిలిచి 'చక్కని చుక్కాని, భద్రమైన కర్ణ ధారి ఉండి ప్రయాణం చేసే వారిని క్షేమంగా గమ్యానికి చేర్చగలది అయిన ఒక మంచి నావను శ్రీరాముడి కోసం సిద్ధం చేసి రేవు దగ్గర సిద్ధంగా ఉండమని ఆజ్ఞాపించాడు. గుహుడి ఆజ్ఞ మేరకు మంత్రులు మంచి నావను సిద్ధం చేశారు. (సశేషం)

★

# జ్యోతిర్విజ్ఞానమ్

(22 వ పేజీ తరువాయి) రకరకాల ఖనిజాలు, లవణాలు, లోహాలు, ఇంధనాలు, తీసుకుంటూ అందులో వుండే అభ్రక, సువర్ణ, రజిత, తామ్ర, యశద, లోహ, మణిశిల, గంధక, పాదరస ఇత్యాది అమూల్య ద్రవ్యాన్ని తవ్వుకోవడమే తప్ప మళ్ళీ భూమిలో చేర్చటానికి ఏ మానవుడు కూడా కనీసం ప్రయత్నం చేయటానికి ఆలోచన కూడా చేయడు. ఈ విధంగా భూమి అంతా కలుషితమై పోతుంది.

"నిస్సారపుశ్రీ నిరౌషధిరసా" అయిపోతుంది దేశమంతా. అలాంటి సమయంలో పరమాత్మ భాగవతంలో మట్టిని తినడం ద్వారా మళ్ళీ పవిత్రమైంది, శక్తివంతమైనది. అని స్వామి మట్టి తినడం ద్వారా భూశుద్ధి జరిగింది. అట్లాగే జలాన్ని కూడా కలుషితం చేస్తున్నారు. సముద్రాలు, నదములు, నదులు, ఉపనదులు, సెలయేళ్ళు వీటిలో రకరకాల పదార్థాలు వేసి అనేక రీతులలో ఆ జలాన్నంతటిని కూడా ఓషధులమయం లేకుండా కలుషితం చేస్తున్న తరుణంలో పరమాత్మ భాగవతంలో కాళీయమర్ధనం ద్వారా శుద్ధి చేశాడు. కాళీయుడు ఎవడో కాదు భాగవతం చెప్తుంది నీళ్లను పాడుచేసే వారందరూ కాళీయులే. అలాంటి కాళీయులను మట్టు బెట్టి మర్దన చెయ్యాలి అని పరమాత్మ తన నోటి ద్వారా మట్టిని శుభ్రం చేసినట్టే తన పాదం ద్వారా కాళీయుని మదాన్ని అణచి జలాన్ని శుద్ధి చేశాడు అని మనకు భాగవతం చెప్తుంది.

(మరికొన్ని విషయాలు వచ్చే సంచికలో) ★

# శ్రీపతి స్తుతి - సుభాషితం

(8 వ పేజీ తరువాయి)

తన చేతులలో ఆయుధాలను ధరించినాడు. అవి చక్రం, బాణం, ఆపన్నుల కభయమిచ్చు ఖడ్గం, శంఖము, డాలు, కౌమోదకి అను గద. అంత వేగంతో విచ్చేసిన హరి మనపై పాప పుంజములు ప్రభావం చూపకుండ మనలను కాపాడు గాక అని ప్రార్థన.

(మరికొన్ని విషయాలు వచ్చే సంచికలో) ★

వైభవంగా

# శ్రీవైష్ణవ సేవాసంఘం రజతోత్సవాలు





శ్రీవైష్ణవసేవా సంఘము, తెలంగాణ 25 సంవత్సరములు పూర్తి చేసుకున్న సందర్భముగా రజతోత్సవములు జూలై 21 తేదీన వైభవంగా జరిగాయి. బి.ఎం.ఆర్ కన్వెన్షన్ సెంటర్ మన్నెంగూడ, హైదరాబాద్‌లో జరిగిన ఈ ఉత్సవాలకు వివిధ జిల్లాలనుంచి ప్రతినిధులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. ఈ కార్యక్రమానికి శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయరు స్వామి, శ్రీశ్రీశ్రీ త్రిదండి రామచంద్ర రామానుజ జీయరు స్వామి విచ్చేసి మంగళాశాసనాలు అందించారు.



సభాధ్యక్షులుగా శ్రీమాన్ డాక్టర్ కె.వి. రమణాచార్యులు, విశిష్ట అతిథులుగా సముద్రాల వేణు గోపాలాచార్యులు సమావేశాన్ని ఆద్యంతం నిర్వహించారు. బ్రాహ్మణ కార్పోరేషన్‌ను రద్దుచేయకుండా పునరుద్ధరించి బ్రాహ్మణ సంక్షేమానికి కృషి చేస్తామని, దేవాలయ భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడతామని ఆత్మీయ విశిష్ట అతిథులుగా విచ్చేసిన ఐటి శాఖా మాత్యులు శ్రీమాన్ దుద్దిళ్ల శ్రీధర్ బాబు వరాల జల్లు కురిపించారు. స్థానిక ఎమ్మెల్యేలు, నాయకులు సమావేశంలో పాల్గొని ప్రసంగించారు. గురుపూర్ణిమనాడు సభను నిర్వహించి ఆచార్యులను సేవించే అవకాశం కల్పించారని వక్తలు శ్లాఘించారు.

ప్రతిభ కనబరిచిన విద్యార్థులను, మేధావులను, విశిష్ట వ్యక్తులను, అన్ని జిల్లాల శ్రీవైష్ణవ సంఘం ప్రతినిధులను సన్మానించారు. సువిశాల ప్రాంగణంలో జరిగిన ఉత్సవాలకు అడుగడుగునా ప్రత్యేక ఆకర్షణలు కనిపించాయి.

ఈ వేడుకల సందర్భంగా సాంప్రదాయ సాంస్కృతిక ప్రదర్శనగా ప్రఖ్యాత భరతనాట్య కళాకారిణి శ్రీమతి మాధవీ రామానుజం యతిపతి జైత్రయాత్ర నృత్యరూపకంగా ప్రదర్శించి సందర్శకులను మంత్రముగ్ధులను చేశారు. కరీంనగర్‌కు చెందిన గోవర్ధనగిరి శ్రీహిత ప్రదర్శించిన పేరిణి నృత్యం అందరిని ఆకర్షించింది. సుప్రసిద్ధ సంగీత ఆచార్యులు శ్రీకొమాండూరి











రామాచారి సంగీత విభావరి ఆకట్టుకుంది. కదలిరా అంటూ శ్రీఆచార్యవేణు రచించిన శ్రీవైష్ణవ గీతానికి శ్రీరామాచారి సంగీతం అందించారు. అంతే కాకుండా శ్రీరామాచారి బృందం రమ్యంగా ఆలపించిన జై శ్రీమన్నారాయణ గీతం అందరిని పరవశులను చేసింది.

శ్రీవైష్ణవసేవా సంఘము తెలంగాణ అధ్యక్షులు శ్రీమాన్ ఎస్.టి.చారి, గౌరవాధ్యక్షులు శ్రీమాన్ కండ్లకుంట యాదగిరాచార్యులు, ప్రధాన కార్యదర్శి శ్రీమాన్ సేనాపతి మోహన్, కార్యవర్గ సభ్యులు అతిథులను సన్మానించారు.

ఈ సందర్భంగా శ్రీవైష్ణవ సేవా సంఘము తెలంగాణ పలు తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించింది. దేవాలయ పాలకమండలులలో వైదికులను, శైవ ఆలయములలో శైవ బ్రాహ్మణులను, విష్ణు క్షేత్రములలో శ్రీవైష్ణవ బ్రాహ్మణులను నియమించి ఆలయ పాలన వ్యవస్థను మరింత పటిష్ఠం చేయాలని ప్రభుత్వాన్ని కోరుతూ ఈ రజతోత్సవ సభ తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించింది. ఆలయాలలో అర్చామూర్తితో అనుబంధం ఉన్న అర్చకులను సాధారణ ఉద్యోగులుగా పరిగణించకుండా వారి బదిలీలు శాశ్వతంగా నివారించాలని తీర్మానించింది. అందరి యోగక్షేమాలు కోరుతూ భగవంతుని ప్రార్థించేవారే బ్రాహ్మణులు.

బ్రాహ్మణ సంక్షేమ పరిషత్తునకు చైర్మన్‌ను నియమించి వంద కోట్ల నిధులు విడుదలకై తీర్మానించింది. ఆర్థికముగా వెనుకబడిన బ్రాహ్మణులకు ఇందిరమ్మ ఇండ్లు పథకం వర్తింపునకై అభ్యర్థన గూర్చి తీర్మానించింది. బ్రాహ్మణుల అపరకర్మల భవనమునకై కనీసం ఒక ఎకరా స్థలము కేటాయింపునకై సహకరించాలని కోరుతూ రజతోత్సవ సభ ఏకగ్రీవంగా తీర్మానించింది. ★








## ఉపాకర్మ, యజ్ఞోపవీత ధారణ

సూత్రానికి వైదిక సంస్కృతిలో ఒక గొప్ప స్థానం, పవిత్రత ఉన్నాయి. ఉపనీతుడైన బ్రాహ్మణుని ద్విజన్మునిగా వైదిక కర్మలకు, వేదాధ్యయనమునకు అర్హునిగా గావించేది పవిత్ర యజ్ఞోపవీతమే,! "యజ్ఞోపవీతం పరమం పవిత్రం" అని పవిత్రతను గురించి స్మృతి, శాస్త్ర, సంహితలు ఎంతో గొప్పగా తెలియజేస్తున్నాయి. లోక కళ్యాణానికి బ్రాహ్మణులు చేసే సత్కర్మలు, వేద విధులు సమాజ శ్రేయస్సు కోసమే అని శాస్త్రాలు చెబుతున్నాయి. శ్రావణ పౌర్ణమి ఆగస్టు 19 నాడు జరిగే ఉపాకర్మగా నూతన యజ్ఞోపవీత ధారణ బ్రాహ్మణులకు నిర్దేశించబడినది. తత్ సంబంధ నియమాలను అనుసరించే పాఠకుల కోసం సులభంగా సంక్షిప్తంగా యజ్ఞోపవీత ధారణ విధిని సేకరించి శ్రీసన్నిధానం వెబ్ సైట్‌లో మీకు అందుబాటుగా ఉంచబడింది.

https://srisannidhanam.org ★



# ఋషి వాక్య ప్రబోధాలు



శ్రీమాన్ శ్రీ డా.యం.టి.ఆళ్వార్ స్వామి

శ్లో॥ యం పాలయసి ధర్మం త్వం
ధృత్యాచ నియమే నచ।
సవై రాఘవ శార్దూల
ధర్మః త్వామభిరక్షతు॥

(వాల్మీకి రామాయణమ్)

శ్రీరాముడు అరణ్యవాసానికి వెళ్ళే సమయం తన తల్లియైన కౌసల్యాదేవి దగ్గరకు వచ్చి అనుమతి కోరాడు. ఆ సమయంలో కౌసల్యాదేవి పలికిన ఆశీర్వాదశ్లోకము.

తండ్రీ! రాఘవా! నీ రక్షణకోసం ఆ అడవులలో నేనేమి చేయగలను? ఒక్కటి మాత్రం నేను చెప్పేది విను! నువ్వు పాటిస్తున్న ధర్మం ఒక్కటే నిన్ను రక్షిస్తుంది. ఏధర్మమును నువ్వు ధైర్యంగా నియమంగా నిత్యమూ పాటిస్తున్నావో అట్టి ధర్మమే నిన్ను రక్షిస్తుంది. ఇదే నా ఆశీర్వాదము అని చెప్పింది.

"కాలస్య అమూల్యతాం జ్ఞాత్వా తత వృథాయాపనం మదోషస్స్యాత్
ఇతి నిశ్చిత్య సత్కాలక్షేప మాచర"

ఈ వేదవాక్యం ఏమి బోధిస్తోందో గమనించండి

కాలము అమూల్యమైనది. దానిని వ్యర్థం చేయడం మహా దోషమని తెలుసుకొని అందరూ కాలాన్ని సద్విని యోగం చేసుకోవాలి.

శ్లో॥ అకర్తవ్యం న కర్తవ్యం
ప్రాణైః కంఠగతైరపి।
కర్తవ్యమేవ కర్తవ్యం
ఇతి ధర్మవిదో విదుః॥ (మనుధర్మ)

కంఠం మునిగి పోయి ప్రాణాల మీదకు వచ్చినా చేయకూడని పనులు చేయరాదు. అట్లే విద్యుక్తధర్మాలను ఆచరించుటలో ప్రాణం పోయేపరిస్థితి వచ్చినా చేసి తీరాలి.

శ్లో॥ యుక్తాహార విహారస్య
యుక్త చేష్టస్య కర్మసు।
యుక్త స్వప్నావ బోధస్య
యోగో భవతి దుఃఖహా॥

పరిమితమైన ఆహారము పరిమితమైన నిద్ర సకాలములో మేల్కొనుట, మంచి ఆరోగ్య ప్రదమగు యోగమును కలగించి దుఃఖమును తొలిగించును.

శ్లో॥ ద్వౌభాగౌ పూరయేదన్నైః
తోయేనైకం ప్రపూరయేత్।
మారుతస్య ప్రచారార్థం
చతుర్థ మవశేషయేత్॥

(ఆరోగ్య సూత్రం)

మన శరీరంలోని ఉదరాన్ని నాలుగు భాగాలుగా గుర్తించి రెండుభాగాలను ఆహారంతో నింపు కోవాలి. మూడవ భాగాన్ని మంచి నీటితో నింపాలి. నాల్గవ భాగాన్ని చక్కగా జీర్ణం చేసుకోవడానికి వీలుగా గాలిలో నింపాలి. ఇది స్థూల శరీరం రాకుండా శారీరిక దార్ఢ్యాన్ని కలిగిస్తుంది.

శ్లో॥ అదాన దోషేణ భవేత్ దరిద్రః
దరిద్ర దోషేణ కరోతి పాపమ్।
పాపాదవశ్యం నరకం ప్రయాతి
పునః దరిద్రః పునరేవ పాపి॥

(ప్రాచీనసూక్తి)

దానం చేయకపోవడమే మన దరిద్రానికి కారణమని గుర్తించండి. దరిద్రం వలన పాపాలను చేయాలని అనిపిస్తుంది. పాపాలు చేయడం వల్ల నరకం ప్రాప్తిస్తుంది. నరకంలో ఉండడంచే మళ్ళీ దరిద్రుల ఇంట పుట్టడం జరుగుతుంది. ఇది ఒక విషచక్రం. (మిగతా 30 వ పేజీలో)

## ఋషి వాక్య ప్రబోధాలు

(29 వ పేజీ తరువాయి) కాబట్టి మానవులు చిన్నతనం నుండి ఏదో ఒక దానం చేయడం అలవరుచుకొని మోక్షానికి చేరుకోవాలి.

నకర్మణా నప్రజయా ధనేన
త్యాగేనైకేన అమృతత్వ మానశుః
(అనధూతోపనిషత్తు)

అమృతత్వాన్ని మోక్షాన్ని కర్మల చేగాని, సంతతి పొందడం ద్వారా గాని, ధన సంపాదన వల్లగాని పొందలేరు. త్యాగం వలనే (సమస్తకర్మలను) మోక్షం లాభిస్తుంది.

శ్లో॥ ఈశావాస్యమిదగ్ం సర్వం
యత్ కించిత్ జగత్యాం జగత్।
తేన త్యక్తేన భుంజీదాః
మాగృధః కస్యస్విత్ ధనమ్॥
(ఈశావాస్యోపనిషత్)

ఈ బ్రహ్మాండంలోని సమస్త పదార్థాలు ఆ పరమాత్మచే వ్యాపించి ఉన్నాయి. కాబట్టి పాపపు బుద్ధులను వదిలి ఆ నారాయణుని సేవించుము. ఇతరుల ధనములకై ఆశపడరాదు.

శ్లో॥ సుఖం లాభశ్చ కీర్తిశ్చ
శాంతిః జ్ఞానం తదైవచ।
త్యాగో దైవానుగ్రహశ్చ
సత్ప్రవర్తనయా భవేత్॥
(ప్రాచీనసూక్తి )

మంచి నడవడిక వలననే సుఖము. లాభము కీర్తి, శాంతి, జ్ఞానము, త్యాగబుద్ధి, దైవానుగ్రహము కలుగుతాయి. శీలమే అన్నిటికన్నా ముఖ్యము.

శ్లో॥ హరేర్నామ హరేర్నామ
హరేః నామైవ కేవలవమ్।
కలౌనాస్త్యేవ నాస్త్యేవ
నాస్త్యేవ గతి రన్యథా।
(మహాభాగవతమ్)

కలియుగంలో హరినామమే హరినామమే హరినామమే దిక్కు. ఈ హరినామం తప్ప మరొక్క దిక్కుగతి లేదు లేదు లేదు. ఇది వేదవ్యాస భగవానుడు పలికినసూక్తి. ★

## భావ గర్భితం స్తోత్రరత్నం

(21 వ పేజీ తరువాయి)

కూడా అధ్యయనం చేయటం, భగవద్రామానుజుల అనేక మహత్తరమైన గ్రంథాలలో యామునుల ప్రభావం కనపడటం అనే విషయాన్ని గమనించినపుడు రామానుజులయొక్క సత్తకు (భూ సత్తాయాం అని ధాతువు. అంటే ఉనికి అని అర్థము) కారణమైన వారు యామునాచార్యులు అనే విషయం స్పష్టమవుతుంది. మరియు ఇట్టి విషయం భగవత్ రామానుజులు స్వయముగా యామునుల విషయంలో అనుగ్రహించిన తనియన్ లో ప్రతిబింబించటం మనం గమనించినప్పుడు భగవత్ యామునుల ప్రభావము వాచామగోచరం (మాటలకు అందనిది) అని తెలుస్తున్నది.

యామునాచార్య శిష్యులలో ప్రధానమైన వారు: పెరియ నంబి, పెరియ తిరుమలై నంబి, తిరుక్కోట్టియూర్ నంబి, తిరుమాలై ఆండాన్, తిరువరంగప్పెరుమాళ్ అరయర్ (యామునాచార్య కుమారుడు), వానమామలై ఆండాన్, ఈశ్వరాండాన్, జీయరాండాన్, ఆళవందారాళ్వాన్, తిరుమోగూరప్పన్, మాఱనేరి నంబి, తిరుక్కచ్చి నంబి, తిరుక్కురుగూర్ దాసర్, వకుళాభరణ సోమయాజియార్, అమ్మంగి, నాథముని దాసర్ (రాజ పురోహితుడు), తిరువరంగత్తమ్మాన్ (రాజ మహిషి).


అనుగ్రహించిన గ్రంథములు: చతుః శ్లోకి (కాంతా చతుః శ్లోకి), స్తోత్రరత్నం, సిద్ధి త్రయం (ఆత్మసిద్ధి, సంవిత్సిద్ధి, ఈశ్వరసిద్ధి), పురుష నిర్ణయము, ఆగమ ప్రామాణ్యం, గీతార్థ సంగ్రహము, మాయావాద ఖండనము ఇత్యాది.

యమునాచార్యుల బాల్యము, విద్యాభ్యాసం, వీరికి ఆళవందార్ అనే నామధేయము ఎలా వచ్చింది, నేరుగా శిష్యరికము చేయకుండానే భగవత్ రామానుజలకు యామునుల అనుగ్రహం ఎలా లభించింది, వీరి స్తోత్ర పాఠాలలో వైశిష్ట్యము, ప్రౌఢ గంభీర అర్థ విశేషాలు మొదలగు అంశాలు యథావకాశం సేవిద్దాము.

## సాహితీ సౌరభం

# సంస్కృత సాహిత్యంలో ఆణిముత్యాలు

శ్రీమాన్ శ్రీ డా.కె.కోదండరామాచార్యులు, ఖమ్మం



హితము అనగా మేలు చేయునది. అట్టి దానితో కూడినది సహితము. సహితము యొక్క భావము సాహిత్యము. దీని యొక్క ప్రయోజనము తాత్కాలికము, శాశ్వతము అని రెండు విధములు. వర్తమాన పరిస్థితులలో నున్న అంశములను గ్రహించి హితమును బోధించినపుడు అది తాత్కాలిక ప్రయోజనము కల్గిన సాహిత్యము. ఉదా॥ ప్రకృతి బీభత్సములు, మానవులచే సృష్టించబడిన అల్లకల్లోలములు.

దేశమునకు, కాలమునకు, వ్యక్తులకు అతీతమై అందరిచే ఆదరింపబడి సందేశము నందించు సాహిత్యమే శాశ్వత ప్రయోజనకారి.

కవివరుని వాక్కు వెంట సరస్వతీదేవి నడుస్తు కవిత్వ ధారను ప్రవహింప చేస్తుంది. కావ్యమునకు రూపును కల్పిస్తుంది. ప్రచోదనాదేవి అయిన సరస్వతి కావ్య కథాగతాంశములతో పాటు కొన్ని విశేషాంశములు ధ్వనించునట్లు కవినోట పలికిస్తుంది. కవికుల గురువు అయిన కాళిదాసు యొక్క కావ్యములలోని విశేషాంశముల తెలియజెప్పుటే నాయీ ప్రయత్నము.

కాళీదాసు రఘువంశము, కుమారసంభవము, మేఘ సందేశము, ఋతుసంహారము మొదలగు కావ్యములను అభిజ్ఞాన శాకుంతలము. మాళవికాగ్నిమిత్రము, విక్రమోర్వ శీయము అను మూడు దృశ్యకావ్యములను రచించెను.

ప్రస్తుతము రఘువంశములోని కొన్ని శ్లోకములు కథను వివరిస్తూనే సమాజమునకు సందేశము నందించి ఆణిముత్యము లెట్లైనవో పరిశీలింతము.

శ్లో॥ వాగర్థా వివసంపృక్తౌ వాగర్థ ప్రతిపత్తయే
జగతః పితరౌ వందే పార్వతీపరమేశ్వరౌ (1-1)

రఘువంశ ప్రారంభమున కాళీదాసు గావించిన ఇష్టదేవతా రూపకమైన శ్లోకమిది.

భావము: శబ్దార్థములవలె కలసియున్నవారు, జగత్తునకు మాతాపితరులు అయిన పార్వతీ పరమేశ్వరులకు శబ్దార్థముల యొక్క సమగ్రజ్ఞానము కలుగుటకై నమస్కరించుచున్నాను.

విశేషాంశము: ఇందు కీలకమైన పదము పితరౌ ఏక శేష సమాసము.

ఈ లోకమున ఒక వ్యక్తి జన్మకు కారకులైన తల్లిదండ్రులు ఎట్లుండాలో, ఎట్లుంటె వారికి విశిష్టస్థానము లభిస్తుందో, అలాంటి వారి వలన ఏమి పొందవచ్చో సూచించినదీ శ్లోకము.

శబ్ధశాస్త్ర మశేషంతు ధత్తే శర్వస్య వల్లభా
అర్థ స్వరూపమఖిలం ధత్తే ముగ్ధేందుశేఖరః

అను వాయు పురాణ ప్రమాణము వల్ల శబ్ద ప్రపంచము పార్వతికిని, అర్థ ప్రపంచము పరమేశ్వరునకు వశమైయున్నవి. కాన శబ్దము తల్లి, అర్థము తండ్రి. శబ్దము, అర్థములవలె తల్లి, తండ్రి విడదీయరాని సంబంధములను కల్గియుండవలెను. శబ్దము బాహ్యస్వరూపి అక్షరములను కనుల ముందుంచుతుంది. అర్థము ఆంతరంగిక స్వరూపి. కార్యోన్ముఖుని చేస్తుంది. పాంచభౌతికమైన శరీరమునకు తల్లి రూపును కల్పిస్తే, తండ్రి తాను ప్రధాన పాత్రధారి యగుచు ఉత్తమమైనా లక్ష్యసిద్ధికి మార్గమును చూపిస్తాడు. కావున ఒకవ్యక్తి జీవమునకు, జీవనమునకు తల్లి తండ్రులే కారణము. వారిర్వురు శబ్దార్థములవలె యుండవలెను.

ఇంకా ఎలా ఉండాలి? పార్వతి పరమేశ్వరులవలె దేహమున సగభాగము కాకున్నా మనసులో, మాటలో, క్రియలో ఒకటై ఉండాలి. అప్పుడే వారు 'జగతః పితరౌ' అనగా వారి చుట్టూ ఉన్న సమాజానికి ఆదర్శమూర్తులౌతారు.

అలాంటి మాతా పితరులే తమ సంతానానికి వాక్కును, అర్థమును రెండింటిని ప్రసాదిస్తారు. ఎందుకనగా అవి రెండు తమ వద్ద ఉన్నవి. ఆచరణ రూపంలో వాని ననుభవించిన రీతిలో. అందుకే ప్రసాదించగలరు.

అన్యోన్యప్రీతి, ఆదర్శమూర్తిమత్వము కలిగిన జననీ జనకులను వారి సంతానము వాగర్థ ప్రతిపత్తి కొరకై సేవించవలెను. అప్పుడే వంశము అభివృద్ధి చెందుతుంది.

( మరికొంత వచ్చే సంచికలో) ★

# శ్రీ ప్రతివాది భయంకరం అణ్ణన్ స్వామి వైభవం

**శ్రీవేంకటేశ్వరస్వామి సుప్రభాత కృతి కర్త**



**శ్రీమాన్ శ్రీ దరిపల్లి సురేశ్ఆచార్యులు**

**తిరునక్షత్రం: కర్కాటక సంక్రమణం, పుష్యమి నక్షత్రం , 4.8.24, ఆషాఢ అమావాస్య.**

**తనియన్:** వేదాంతదేశికకటాక్ష వివృద్ధబోధం
కాంతోపయంతృయమినః కరుణైకపాత్రమ్।
వత్సాన్వవాయ మనవద్యగుణై రుపేతం
భక్త్యా భజామి పరవాదిభయంకరార్యమ్॥

ప్రస్తుత కాలంలో మనము ప్రతి దేవాలయంలో శ్రీవెంకటేశ్వర సుప్రభాతం వింటున్నాము, ప్రతి శనివారం రేడియోలో లో కూడా వస్తుంది, దీనిని రచించినవారు శ్రీ ప్రతివాది భయంకరం అణ్ణన్ స్వామి. వీరు రచించిన సుప్రభాతం ఆధారంగానే అన్ని దేవీ దేవతలకు కవులు సుప్రభాతం రచించారు. అందరికి అదే మూలం, స్ఫూర్తి.



వీరు మణవాళ మామునుల వద్ద ఉండే ప్రసిద్ధ అష్టదిగ్గజ పండితులలోని వారు.

శ్రియఃపతియైన సర్వేశ్వరుడు పరమ కృపచే మనలను ఉజ్జీవింప జేయడానికి ఆళ్వారులను, ఆచార్యులను అపుడపుడు అవతరింపచేస్తాడు. అట్లా అవతరించిన వాళ్లలో ప్రపన్నజనకూటస్తులు నమ్మాళ్వార్లు, విశిష్టాద్వైత ప్రవర్తకులు భగవద్రామానుజలు అద్వితీయులు.

ఆ భగవద్రామానుజులు శ్రీవైష్ణవ సిద్ధాంతమును దిగంత వ్యాప్తి కై ఏర్పరచిన 74 సింహాసనాధిపతులలో ఒకరు ముడుంబై నంబి యనువారు. వారి వంశంలోని పిళ్లయి లోకాచార్యుల పినతండ్రి మనుమలు. మరియు వడక్కు తిరువీధి పిళ్లయి సహోదరులు శ్రీమన్నారాయణాచార్యుల వారి ప్రపౌత్రుల కుమారులు శ్రీ ప్ర. భ. అణ్ణన్.

వీరి తండ్రి గారు శ్రీఅనంతచార్యులు, తల్లి గారు శ్రీ ఆండాళ్. వీరి తండ్రి హస్తిగిరినాథరన్నన్. భార్య పేరుందేవి. కుమారులు ముగ్గురు, మూడు దివ్య దేశాలలో పెరుమాళ్ళ కైంకార్యానికి నియమించారు. జ్యేష్ఠ కుమారులు అన్నరప్పా, వీరు తిరువేంగడంలో, ద్వితీయులు అనంతాచార్యులు కాంచీపురంలో, కనిష్టులు తిరునారాయణపురంలో నిత్య నివాసం ఉంటూ కైంకర్యం చేస్తూ ఉండే వారు. వీరు కాంచి పురమునకు దగ్గర లోని తూప్పుల్‌లో అవతరించిరి. వీరుతండ్రి గారి వద్దనే పంచ సంస్కారములు పొంది, కంచి శ్రీ వరదరాజస్వామికి శాల క్కిణర్ తీర్థ కైంకర్యం చేస్తూ ఉండేవారు. ఆ వరదరాజస్వామి వారి ఆజ్ఞతో శ్రీవేదాంతదేశికుల కుమారులయిన నయనవరదాచార్యులను ఆశ్రయించి శ్రీభాష్యమును సేవించిరి. వారి వద్దనే సామాన్య, విశేష శాస్త్రములను అభ్యసించి విశేష ప్రతిభతో ప్రవచనములు చేసెడివారు.

ఆ కాలంలో నృసింహమిశ్రుడనే మాయావాది కంచికి వచ్చి నయన వరదాచార్యులతో వాదానికి వస్తే వారు వార్ధక్యముచే వాదానికి వెళ్లకుంటే తన శిష్యుడు ఐన శ్రీఅణ్ణన్‌స్వామి గురువు గారిని ప్రార్థించి తాను వెళ్తానన్నారు, గురువుగారు సంతోషించి హయగ్రీవ బీజాక్షరములు తమలపాకుపై వ్రాసి ఇచ్చి ఆశీర్వదించి పంపారు. శ్రీ అణ్ణన్‌స్వామి వెళ్లి వాదించి ఆ మాయవాదిని జయించి వచ్చి, గురువుగారికి దండం సమర్పించగా, సంతోషించి, మీరు ప్రతివాది భయంకరులని కటాక్షించిరి. ఆ నృసింహ మిశ్రుడును అణ్ణన్‌కు శిష్యులైరి. ఆ నృసింహ మిశ్రునికి హయగ్రీవ దాసుడని నామమునుంచిరి. కంచి వరదుడును అర్చక ముఖేన ప్రతివాది భయంకరులని అరులప్పాడు సాయించి మర్యాదచేసిరి. (ఇంకావుంది)

# కొల్వాయి రామచంద్రస్వామి

సేకరణ: శ్రీమాన్ డి,హేమంతాచార్యులు









జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలము కొల్వాయి గ్రామంలో శ్రీరామచంద్రస్వామి దేవాలయం ప్రాచీనమైనది. సుమారుగా 600 సంవత్సరాలకు పూర్వం భగవంతుడు ఒక భక్తుని స్వప్నంలో సాక్షాత్కరించి నేను ఫలానా చోట ఉన్నాను అని చెప్పడంతో ఆ భక్తుడు భగవంతుని మీద ఎంతో విశ్వాసంతో స్వామి చెప్పిన చోటుకి వెళ్లి చూడగా అక్కడ స్వామి ఆ భక్తునికి కనిపించడం జరిగింది. దానితో భక్తుడు ఎంతో ఆనందించి స్వామివారికి సేవ చేయాలి అనే కోరికతో



కొలవాయ గ్రామం యొక్క అందరి సహకారంతో ఆ స్థానంలో ఒక మందిరాన్ని నిర్మించాడు. భగవంతునికి నిరంతరం సేవలు చేస్తూ ఉన్నాడు. కొలవాయ గ్రామంలో ఉన్న ప్రజలు అందరూ కూడా ఆ శ్రీరామచంద్రమూర్తిని తమ ఇంటి వాడిలా భావించి భక్తితో అనేక కైంకర్యాలు చేస్తూ ఉన్నారు.

ఇక్కడ శ్రీరామ నవమి ఉత్సవాన్ని పురస్కరించుకొని ఎంతో ఘనంగా బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారు. ఆలయాన్ని గ్రామస్తులందరూ కలిసి కొద్దికొద్దిగా అభివృద్ధి చేసి ఇప్పుడు రామాలయాన్ని ఎంతో విశేషంగా నిర్మించుకోవడం జరిగింది. చుట్టు ప్రక్కల గ్రామాల్లో ఉండే భక్తులంతా కూడా వచ్చి బ్రహ్మోత్సవాలలో పాల్గొని స్వామి అనుగ్రహాన్ని పొందుతూ ఉన్నారు. అలానే ఆలయానికి తన వంతు సహాయంగా తమ భూభాగాన్ని సమర్పించిన వారు రామడుగు బుచ్చి దొర, చంద్రశేఖర రావు గారలు. వీరి సహకారంతో ఆలయ నిర్మాణ అభివృద్ధి జరిగింది. ఇక్కడి అర్చక స్వాములు 1.తిరుమల రాఘవాచార్యులు, 2.తిరుమల లవకుమారాచార్యులు, 3.తిరుమల రాజ్ కుమారాచార్యులు,4. కుశకుమారాచార్యులు.










# పరమపదోత్సవం






శ్రీ జగన్నాథ్ మఠం సీతారాంబాగ్ లో శ్రీశ్రీశ్రీ వైకుంఠవాసులు కీ.మూ. త్రిదండి వ్రత ధర రామానుజ జీయర్ స్వామి వారి పరమపదోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీ రామానుజ యాజ్ఞిక పీఠం అధ్యక్షులు యజ్ఞాచార్య స్వామి శ్రీమాన్ గోవర్ధన విద్యుల్లతా ప్రవీణ్ కుమార్ ఆచార్య స్వామి. శ్రీశ్రీశ్రీ పరమహంస పరివ్రాజకాచార్య త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్ స్వామి, శ్రీశ్రీశ్రీ త్రిదండి దేవనాథ రామానుజ జీయర్ స్వామి, శ్రీశ్రీశ్రీ త్రిదండి అహోబిల రామానుజ జీయర్ స్వామి, శ్రీశ్రీశ్రీ త్రిదండి రామచంద్ర రామానుజ జీయర్ స్వామి, శ్రీశ్రీశ్రీ త్రిదండి శఠగోప రామానుజ జీయర్ స్వామి. మరియు భాగవతోత్తములు. అశేష భక్త జనావళి పాల్గొన్నారు.

కరీంనగర్, సప్తగిరి కాలనీలో శ్రీశ్రీశ్రీ త్రిదండి కృష్ణ యతీంద్ర జీయర్ స్వామి వారి పరమపదోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో శ్రీ శ్రీ శ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన జీయర్ స్వామి వారు, శ్రీశ్రీశ్రీ అహోబిల జీయర్ స్వామి వారు మరియు పూర్వాశ్రమ కుటుంబ సభ్యులు, భాగవతోత్తములు, భక్తులు పాల్గొన్నారు.


## యజ్ఞ వరాహ స్వామి క్షేత్రం కరీంనగర్‌లో పవిత్రోత్సవాలు


# స్వాతంత్ర్య యోధుడు వేలు తంబి

శ్రీమతి విజయ కందాళ




ఆగస్టు నెల వచ్చిందంటే పిల్లలకు జెండా వందనం గుర్తుకొచ్చి మనసులో కొత్త ఉత్సాహం మొదలవుతుంది. పెద్దల మనసుల్లోనూ దేశ భక్తి పొంగుతుంది.

మన స్వాతంత్ర్య పోరాటం రక్తపాతరహితమైనది. అయితే ఈ పోరాటంలో ఎంతోమంది త్యాగధనులు తమ సర్వస్వాన్ని త్యాగం చేశారు. వారిలో కొంత మందిని మాత్రమే మనం గుర్తుపట్టగలం. మనకు తెలియని వారెందరో ఈ పోరాటంలో కృషి చేశారు. అలాంటి వారిలో ఒక మహానుభావుడు వేలు తంబి. ఆయన గురించిన వివరాలను కొన్నింటిని తెలుసుకుందాం.

గొప్ప దేశభక్తుడు వేలు తంబి. ఆయన దృష్టి అంతా స్వేచ్ఛా భారతాన్ని సాధించాలని. దాని కోసం ఎన్నో త్యాగాలు చేశారు. వేలుతంబి ధైర్యవంతుడు, దూరదృష్టి గల నాయకుడు.

ట్రావన్కోర్లో ఈస్ట్ ఇండియా కంపెనీ పాలనకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో ఈయన కీలక పాత్ర పోషించారు. ఈ ట్రావెన్కోర్ ప్రస్తుతం కేరళ రాష్ట్రంలో ఒక భాగం. 1802 నుండి 1809 వరకు ట్రావెన్కోర్ రాజ్యానికి ప్రధానమంత్రిగా పనిచేశారు. మంచి పరిపాలకుడు. తన పదవీకాలంలో పరిపాలనను ఆధునీకరించాడు, సంస్కరించాడు.

ఈయన 6 మే 1765 కన్యాకుమారిలోని తాళ క్కుళామ అనే గ్రామంలో జన్మించాడు. దివాన్ వేలు తంబి తిరుగుబాటు బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా జరిగింది. తన రాజు కోరికలకు వ్యతిరేకంగా ఒక రాష్ట్ర ప్రధానమంత్రి మాతృభూమిని రక్షించుకోవటానికి ఈస్ట్ ఇండియా కంపెనీతో యుద్ధం ప్రకటించాలని నిశ్చయించుకున్నాడు. నేటికీ త్రివేంద్రంలో ఈయన విగ్రహం చూడవచ్చు.

ఒకరోజు ట్రావెన్కోర్ రాజు రాజా బలరామవర్మకు బ్రిటిష్ ప్రభుత్వం వారికి చెల్లించే కప్పాన్ని రెట్టింపు చేస్తూ వెంటనే చెల్లించాల్సిందిగా లేఖను పంపారు. రాజుగారు పక్కనే ఉన్న మంత్రి వైపు తిరిగి ఇలా అన్నారు. ఈ పత్రం ప్రకారం చెల్లించాలంటే మన ఖజానా ఖాళీ అవుతుంది. విపరీతంగా నష్టపోతాము. మీరు వెంటనే వెళ్లి ఆంగ్లేయులకు నచ్చ చెప్పి రండి అని మంత్రి అయిన వేలుతంబిని పంపించారు. అతను ప్రయత్నించినా బ్రిటిష్ వారి ధోరణి మారలేదు. రాజా బలరామవర్మను అనేక రకాలుగా తూలనాడారు.

ఈ పరిస్థితిలో ఆత్మ గౌరవం, దేశభక్తి గల వేలు తంబి స్వాతంత్రం కోసం పోరాటమే మేలు అని నిశ్చయించుకున్నాడు. రాజు ప్రాణాలకు ముప్పు అని వారించినా వినకుండా బ్రిటిష్ వారికి లొంగకుండా తన సహచరులతో కలిసి పోరాటం సాగించాడు తిరుగుబాటు చేసి విజయం సాధించాడు. ఆ రోజుల్లో వేలు తంబి ధాటికి తాళలేక 1810 లో ఆయనను బంధించి లేదా కాల్చి చంపిన వారికి 50000 రూపాయల బహుమానము బ్రిటిష్ ప్రభుత్వం ప్రకటించింది. దాంతో ఆయన కోసం సైనికుల గాలింపు ప్రారంభమైంది. దుష్టులు బలవంతులైన బ్రిటిష్ వాళ్లు అతన్ని లొంగదీయాలని ప్రయత్నించారు. చివరికి ఆయన నివాసాన్ని చుట్టుముట్టిన సైన్యానికి చిక్కకుండా ప్రాణత్యాగం చేశాడు. వేలు తంబి వంటి వీరుల మార్గదర్శకం, ఆదర్శం వలననే 1857లో మొదటి స్వాతంత్ర్య యుద్ధం జరిగింది.

ఈ విధంగా దేశాన్ని, దేశ సంస్కృతిని కాపాడటానికి ఎంతోమంది ప్రాణత్యాగం చేసి పోరాడితేనే మనకు స్వాతంత్రం సిద్ధించింది. మనం కూడా సమస్యలకు భయపడకుండా ఆత్మవిశ్వాసంతో తెలివితేటలతో పరిష్కరించుకొని మన దేశం గొప్పతనాన్ని కాపాడాలి. సంస్కృతి సంప్రదాయాలకు విలువ నిచ్చి గౌరవించాలి. ★

PRAPATTI SRISANNIDHANAM Telugu Monthly AUG 2024 RNI NO : TELTEL12303

# శ్రీసన్నిధి పదకేళి 6

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| ■ | 1 | | | | | | ■ | ■ |
| ■ | ■ | 2 | | | | | | ■ |
| 4 | ■ | 3 | | | | | ■ | 5 |
| | ■ | 7 | | | | ■ | 6 | |
| | 8 | ■ | ■ | ■ | ■ | ■ | | |
| | | 9 | 10 | 11 | 12 | ■ | | |
| ■ | | | | | | ■ | | |
| 13 | | | | ■ | | ■ | | |
| | ■ | ■ | | ■ | ■ | ■ | ■ | |

## అడ్డం

1.పరమాత్మ నాలుగుచోట్ల ఆరాధన అందుకోవటాన్ని (6)
2.లక్ష ఇరవై ఐదువేల శ్లోకాల గ్రంథము (6)
3.వాస్తు భేదములు ఎన్ని? (శుభాశుభ నిర్ణయం) (5)
7.దేవాలయంలో ప్రసాదం సిద్ధం చేసేవారిని (4)

## నిలువు

4.గర్భం దాల్చిన వెంటనే జన్మిస్తే (4)
5.గ్రంథాలను పరిచయం చేసే శీర్షిక (7)
6.వ్యాస పూర్ణిమకు మరో పేరు (5)
8.మగువలు ఆషాఢ మాసం చేతులకు పెట్టుకునేది (4)
9.సంకల్పము (3)
10.మదాలస ఋతుధ్వజుల కుమారుడు (4)
11.ధుగ్ధం (2)
12.తిరునారాయణపురం (3)
13.కైంకర్యము (2)

## శ్రీసన్నిధి పదకేళి (5) సమాధానాలు

విజేతలకు ఆగస్టు నెల పత్రిక పంపించడం జరుగుతుంది

నిలువు: 1.అనసూయ 2.వజ్రాయుధం, 3.పెరియనంబి, 4.సింధూరం 5.తులసీదళము, అడ్డం : 5.తులసిదాసు, 6. వాయు, 7. సూర్య, 8. చంద్ర, 9.కాకి, 10.ఇంగువ, 11. ప్రవచనాలు, 12.హనుమంతుడు 13.ప్రశ్న. సరియైన సమాధానాలు పంపినవారు: డా.రాజవర్ధన్, నిజాంపేట్. సువర్ణ, సిరిసిల్ల, జి.సునంద, వైజాగ్, లక్ష్మీప్రియ.యస్, యాదాద్రి, నరసింహాచారి కె.యస్.వి, బెంగళూర్, రాధాక్రిష్ణ రాదారపు, కరీంనగర్, ఏ.హనుమంతరావు, మేడ్చల్.

## పదకేళిలో పాల్గొనండి! ఉచిత పత్రిక అందుకోండి!!

ఈ పదకేళిలో సరియైన సమాధానాలు వ్రాసి సరియైన జవాబులు 9502583323 వాట్సప్ ద్వారా పంపండి.

Printed & Edited and Published by DINGIRI SRINIVASA MURTHY on behalf of SRISANNIDHANAM CHARITABLE TRUST and Published at H.No 10-2-225, Vidhyanagar, Karimnagar, Telangana - 505 001
Editor DINGIRI SRINIVASA MURTHY, RNI Title No TELTEL12303, Cell No : 9502583323, Land line No 0878-2253323
Email Id prapatti.srisannidhanam9@gmail.com.